# విద్యార్థి వెలుగు

Volume IX - Issue II - Feb 2026



## అనంత ప్రేమ

సంపాదకీయం

# హద్దులు లేని ప్రేమ

కల్వరి గిరిపై మధ్యాహ్నపు సూర్యుడు తన తేజస్సును కోల్పోయి చీకటి అలుముకున్న వేళ, ఆ సిలువపై నుండి వినిపించిన "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరు ఎరుగరు గనుక వీరిని క్షమించుము" అన్న మాటలు మానవ చరిత్రలో ప్రేమకు కొత్త నిర్వచనాన్ని అందించాయి. రోమన్ సామ్రాజ్యపు క్రూరత్వం, మత ఛాందసవాదుల ద్వేషం ఏకమై క్రీస్తును బంధించాలని ప్రయత్నించినా, మరణపు సంకెళ్లను సైతం తెంచుకుని ప్రవహించిన ఆ ప్రేమ 'హద్దులు లేనిది'. చరిత్రలో అనేకులు రక్తం చిందించి, మోసం చేసే సామ్రాజ్యాలను నిర్మించారు, కానీ కేవలం ప్రేమతోనే హృదయాలను జయించి, యుగయుగాల వరకు చెరగని ముద్ర వేసిన ఏకైక శక్తి దైవిక ప్రేమ మాత్రమే.

సృష్టికర్త తన సృష్టిని ఎంతగా ప్రేమించాడో తెలియజేయడానికి "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" (యోహాను 3:16) అన్న వాక్యం పునాది వంటిది. ఇక్కడ 'ఎంతో' అనే పదం మానవ మేధస్సుకు అందని ఒక అనంతమైన కొలతను సూచిస్తుంది. లోకపు ప్రేమ ప్రతిఫలాన్ని ఆశిస్తుంది, అర్హతను వెతుకుతుంది; కానీ దైవిక ప్రేమ అర్హత లేని వారిని వెతుక్కుంటూ వస్తుంది. అపొస్తలుడైన పౌలు రోమీయులకు రాస్తూ, "మనం ఇంకా పాపులమై ఉండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" అని ప్రకటించాడు. అంటే, మన నీతిని చూసి కాక, మన అవస్థను చూసి కురిపించిన అమృతధార ఆ ప్రేమ. ఇది పక్షపాతం లేని దైవిక ప్రేమ. మంచు పర్వతం నుండి జాలువారే నది గమ్యం వైపు దూసుకుపోయినట్లు, తండ్రి ప్రేమ పరలోకపు మహిమను విడిచి కల్వరి వరకు బంధనాలను తెంచుకుని ప్రవహించింది.

విశ్వాసి జీవితంలో ఈ 'హద్దులు లేని ప్రేమ' కేవలం ఒక సిద్ధాంతంగా మిగిలిపోకూడదు, అది ఒక జీవన విధానంగా రూపొందాలి. అగస్టిన్ అనే భక్తుడు "దేవునిని ప్రేమించు, ఆపై నీకు ఇష్టం వచ్చినది చేయి" అన్నాడు. ఎందుకంటే దేవుని ప్రేమలో బంధించబడిన వ్యక్తి పాపానికి బానిస కాలేడు. నిజమైన ప్రేమకు స్వార్థం అనే సంకెళ్లు ఉండవు. 1 కొరింథీయులకు 13వ అధ్యాయం ప్రేమ యొక్క లక్షణాలను వివరిస్తూ, అది "స్వప్రయోజనమును విచారించుకొనదు" అని స్పష్టం చేస్తుంది. నేటి సమాజంలో గోడలు నిర్మించుకోవడం సులభం, కానీ వంతెనలు కట్టడం కష్టం. అయితే క్రీస్తు ప్రేమ శత్రువుల మధ్య ఉన్న ద్వేషపు గోడను కూల్చివేసింది. స్తెఫను తనను రాళ్లతో కొట్టి చంపుతున్న వారి కోసం ప్రార్థించడం వెనుక ఉన్నది ఈ 'హద్దులు లేని ప్రేమ' మాత్రమే. ఇది లోకపు తర్కానికి అజ్ఞానంగా అనిపించవచ్చు, కానీ విశ్వాసికి ఇది పరలోకపు సాక్ష్యం.

అంతిమంగా, మన ఆధ్యాత్మిక పరిపక్వత మనం ఎంత భక్తిని ప్రదర్శిస్తున్నాం అనే దానిపై కాక, మనం ఎంతగా ప్రేమిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది. "మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగల వారైనయెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను" (యోహాను 13:35) అని ప్రభువు ప్రకటించారు. మన ప్రార్థనలు, ఉపవాసాలు, బలులు అన్నీ ప్రేమ లేనినాడు "మ్రోగెడి కంచును, గణగణలాడెడి తాళమును" మాత్రమే. బంధనాలు లేని ప్రేమ అంటే నియమాలను అతిక్రమించడం కాదు, నియమాలను నెరవేర్చడం. ప్రేమ ధర్మశాస్త్రమును సంపూర్ణం చేస్తుంది. కాబట్టి, మన చుట్టూ ఉన్న ద్వేషపు చీకటిని తోసివేయడానికి, క్షమించలేని వారిని క్షమించడానికి, ప్రేమించలేని వారిని ప్రేమించడానికి ఆ పరిశుద్ధాత్మ శక్తితో నింపబడదాం. క్రీస్తు ప్రేమ మనల్ని బలవంతం చేయును గాక!

– కె. జాన్ భూషణం

# విద్యార్థి వెలుగు

Vol. IX - Issue II - Feb 2026

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH



## EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad
Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad
UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad
Advisor:
Mr. S. Simon, Hyderabad
**Members:**
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. V. Lilly Thedora, Hyderabad
Dr. Yerranna Boggula, Medchal Malkajgiri
Mrs. B.Lily Agnes, Mancherial
Dr. S. John Sukumar, Nizamabad
Ms. U. Catherine Chelsea, Hyderabad



## CONTACT DETAILS

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com


**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-
**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-
**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-
**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

| | |
|---|---|
| Name | - UESI PUBLICATION TRUST |
| Bank | - Canara Bank |
| A/C No | - **0624101037187** |
| Branch | - Pragathinagar |
| IFSC code | - CNRB0004173 |

Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEMES:**

Mar - Rise Above
Apr - Bloom

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

## విషయ సూచిక


| | |
|---|---|
| అనంత ప్రేమ | 4 |
| మీ ప్రశ్న - మన జవాబులు | 7 |
| బంధాలను బలోపేతం చేద్దాం | 8 |
| దైవ ప్రేమలో నా నూతన ప్రయాణం | 10 |
| ఆరోగ్యకరమైన సరిహద్దులను నిర్ణయించుకోవాలి | 13 |
| గోధుమ గింజ జోసెఫ్ అభిషేకరావు | 18 |
| పారిపోవడానికి కాదు బ్రో... పరిగెత్తడానికి | 22 |
| గ్రేడ్స్ కంటే స్కిల్స్ మిన్న | 24 |
| అర్బన్ స్టూడెంట్స్ మినిస్ట్రీ ఎందుకు అవసరం? | 28 |


## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్‌స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ కె.ఫణి కుమార్ (89854 82388) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

**ప్రతి నెల ప్రార్థనాంశాలు 20వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు** editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

**- ఎడిటోరియల్ బోర్డ్**



# అనంత ప్రేమ

"ప్రేమ" – ఈ మాట వినగానే ఏదో ఒక అమోఘమైన ఫీలింగ్ కలగనివారు ఎవరూ ఉండరు. ప్రేమ, మహబ్బత్, కాదల్, ఇష్క్, ప్యార్... భాష వేరైనా భావం ఒక్కటే అన్నది ఒకప్పటి మాట! కానీ ఆధునిక ప్రపంచంలో ఎవరికి నచ్చినట్లు వారు దీనికి ఎన్నో భాష్యాలు చెప్పుకుంటున్నారు. అసలు ప్రేమ అవసరం లేనిది ఎవరికి?

పుట్టిన శిశువు నుండి చనిపోయే వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ప్రేమ అవసరమే. ఇది చిన్నవారికి అనురాగాన్ని పంచితే, యువతను ఉగ్రూతలూగించి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది, పెద్దవారికి భరోసా ఇస్తుంది. మొత్తానికి "ప్రేమ" అనే రెండక్షరాలు ఈ లోకాన్ని శాసిస్తున్నాయి. అందుకేనేమో "ప్రేమే జగతికి మూలం, ప్రేమే దైవ స్వరూపం, ప్రేమే నిత్యజీవం, ఆ ప్రేమే మోక్షమార్గం" అన్నాడు ఓ కవి.

> "సమస్త సముద్రాలన్నీ సిరాగా మారినా, ఆకాశమంతా కాగితంలా విస్తరించినా, భూమిపై ఉన్న ప్రతి చెట్టు కలముగా మారినా, దేవుని ప్రేమను సంపూర్ణంగా వ్రాయడం ఎప్పటికీ సాధ్యం కాదు."
>
> – ఫ్రెడరిక్ ఎం. లెమాన్

నిజమే, దేవుని ప్రేమ అద్భుతమైన సత్యం. పాపుల పట్ల ఆయన స్వభావసిద్ధమైన కనికరము ద్వారా చూపిన కృపాకార్యమే దేవుని ప్రేమ. "దేవుడు అనర్హులను ప్రేమిస్తాడు." మానవుల మధ్య ప్రేమ అనేది ప్రియునిలోని ఏదో ఒక గుణం వల్ల మేల్కొంటుంది. కానీ దేవుని ప్రేమ ఉచితమైనది, సహజమైనది, ఎటువంటి కారణం లేనిది. మనిషిలోని ఏ గుణమూ దానిని ఆకర్షించలేదు లేదా ప్రేరేపించలేదు.

## 1. దేవుని ప్రేమ – భిన్నమైన స్వభావం

ఈ ప్రపంచంలో ప్రేమను చాలాసార్లు పనితీరు, అంగీకారం, విజయంతో కొలుస్తారు. కానీ బైబిల్ బోధించే దేవుని ప్రేమ పూర్తిగా భిన్నమైనది. దేవుని ప్రేమ మనం సంపాదించుకునేది కాదు, అలాగే అది ఎప్పటికీ ఉపసంహరించబడేది కాదు. అది షరతులు లేని ప్రేమ – స్వేచ్ఛగా ఇవ్వబడినది, విశ్వాసయోగ్యమైనది, శాశ్వతమైనది.

"దేవుడు మనుష్యులను ప్రేమిస్తాడు, ఎందుకంటే ఆయన వారిని ప్రేమించాలని ఎంచుకున్నాడు... ఆయన ప్రేమకు ఆయన సొంత సార్వభౌమ సంతోషం తప్ప మరే కారణమూ లేదు." కానీ "దేవుడు ప్రేమ" (1 యోహాను 4:8) అనే మాట గురించి అనేక తప్పుడు ఆలోచనలు ఉన్నాయి. అందువల్ల దేవుని ప్రేమ ఏమిటో ఆయన వాక్యములో వెల్లడైన ప్రకారం మనం పరిశీలించాలి.

"మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది" (రోమా 5:5). అంటే దేవుని పట్ల మన ప్రేమ కాదు; దేవుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడనేది అర్థమవుతుంది.

"కుమ్మరింపబడినది" అంటే "ధారాళంగా పోయబడింది" లేదా "ఉప్పొంగి ప్రవహించింది" అని అర్థం. ఇది వరదలా నిండిపోవడాన్ని సూచిస్తుంది. దైవిక ప్రేమ తాత్కాలిక భావాల గురించి కాదు; లోతైన, బలమైన, హృదయమును ముంచెత్తే అనుభూతుల గురించి ఆలోచింప జేస్తుంది.

దేవుని ప్రేమ ఆయన పవిత్రతకు విరుద్ధమైనది కాదు: "ప్రేమగల దేవుడు మొదటిగా మరియు ముఖ్యంగా వెలుగైన దేవుడు." దేవుడు నైతిక భేదాల పట్ల నిర్లక్ష్యంగా ఉండే దేవుడు కాదు; ఆయన నీతిని ప్రేమించి, దుర్నీతిని ద్వేషించే దేవుడు. ఆయన తన పిల్లలనుండి కోరుకునేది పరిపూర్ణత.

**జె. ఐ. ప్యాకర్ నిర్వచనం:**
"దేవుని ప్రేమ అనేది పాపుల పట్ల ఆయన మంచితనాన్ని కార్యరూపంలో చూపించడమే. వారి క్షేమంతో తనను తాను ఐక్యము చేసుకొని, వారికి రక్షకుడిగా తన కుమారుని ఇచ్చి, ఒడంబడిక సంబంధంలో ఆయనను తెలుసుకొని ఆనందించేటట్లు వారిని తీసుకొచ్చే కార్యమే దేవుని ప్రేమ."

## 2. దేవుని ప్రేమ షరతులు లేనిది, శాశ్వతమైనది

దేవుని ప్రేమ మన ప్రవర్తనలో కాదు, ఆయన స్వభావంలోనే నిక్షిప్తమై ఉందని బైబిల్ స్పష్టంగా ప్రకటిస్తుంది.

* "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా, మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).
* "నేను శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను" (యిర్మియా 31:3).

మన ఆత్మీయ పనితీరు ఆధారంగా ఆయన ప్రేమ మారదు. ఏ పని చేయకముందే ఒక శిశువును తల్లి ప్రేమించేలా, మన కార్యాలకు ముందే దేవునికి మనపై ప్రేమ కలిగింది.

## 3. లోక ప్రేమ వర్సెస్ దేవుని ప్రేమ

లోకంలో "నేను విజయవంతమైతేనే నన్ను ప్రేమిస్తారు" అనుకుంటారు. కానీ దేవుడు నన్ను ప్రేమించాలని ఎంచుకున్నాడు కనుకనే నేను ప్రేమింపబడుతున్నాను. నా ఆధిక్యతల వల్ల కాదు, క్రీస్తు వల్లనే నేను అంగీకరింపబడ్డాను. ప్రమాదం ఏమిటంటే, ఈ లోక ప్రేమకు ఆకర్షితులు అయినవారు దేవునిని ప్రేమతో కాకుండా భయం,

అపరాధభావంతో సేవిస్తారు. కృప ఆధారిత దేవుని ప్రేమ కృతజ్ఞతను, ఆనందాన్ని, ధైర్యాన్ని కలిగిస్తుంది.

**4. దేవుని బిడ్డలమనే గుర్తింపులో విలువ**

మన సంస్కృతి విలువను రూపం, సాధన ఆధారంగా నిర్ణయిస్తుంది. దేవుడు మాత్రం విలువను ఆయనతో మన సంబంధం ఆధారంగా నిర్ణయిస్తాడు. “నీవు నా దృష్టికి ప్రియుడవైనందున... నేను నిన్ను ప్రేమించుచున్నాను” (యెషయా 43:4).

**దేవుని వాక్యములో మన గుర్తింపు:**

తిరస్కరింపబడినవారము కాదు – ఎంచుకోబడినవారము

విలువలేనివారము కాదు – విమోచింపబడినవారము

మరచిపోబడినవారు కాదు – లోతుగా ప్రేమింపబడినవారము

**5. పరిస్థితులు విరుద్ధంగా ఉన్నప్పుడు నమ్మడం**

బాధలు, శ్రమలు, తిరస్కరణ – ఇవన్నీ దేవుని ప్రేమపై సందేహం కలిగించవచ్చు. విశ్వాసం అంటే భావాలకన్నా దేవుని స్వభావాన్ని నమ్మడం. ముఖ్యమైన సత్యం ఏమంటే దేవుని ప్రేమ పరిస్థితుల ద్వారా కాదు, సిలువ ద్వారా నిరూపించబడింది. మేఘాలు సూర్యుడిని కప్పివేయవచ్చు గానీ తొలగించలేవు. అలాగే శ్రమలు దేవుని ప్రేమను కనిపించనివ్వకపోవచ్చు, కానీ లేకుండా చేయలేవు.

**6. దేవుని పరిపూర్ణ ప్రేమకు కృతజ్ఞత**

కృతజ్ఞత దేవుని ప్రేమను ప్రతిరోజూ అనుభవించేటట్లు చేస్తుంది. “ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులను చెల్లించుడి” (1 థెస్స 5:18). కృతజ్ఞతగల హృదయం ఆనందభరితమైన హృదయంగా మారుతుంది; ఆనందభరితమైన హృదయం దేవుని ప్రేమను లోకములో ప్రతిబింబిస్తుంది.

**దేవుని ప్రేమించడమంటే**

* ఆయన మనకిచ్చే బహుమతుల కంటే మిన్నగా, ఆయననే ఎక్కువగా ఆశించడం.
* ఆయన అనుగ్రహించే వరాల కంటే ఎక్కువగా, దేవునినే గొప్ప నిధిగా భావించడం.
* ఆయన ఇచ్చే ఆశీర్వాదాలను బట్టి కాకుండా, స్వయంగా దేవుని యందే ఆనందించడం.
* ఆయన ప్రసాదించే వాటికంటే ఎక్కువగా, ఆయనలోనే తృప్తిని పొందడం.
* ఆయన ఇచ్చే బహుమానాల కంటే మిన్నగా, దేవుని హృదయానికి హత్తుకోవడం.
* ఆయన ఇచ్చే ఫలాల కంటే ఎక్కువగా, ఆయన సాన్నిధ్యాన్నే ఆస్వాదించడం.
* ఆయన ఇచ్చే బహుమతుల కంటే మిన్నగా... ఆయనను గౌరవించడం, విలువనివ్వడం, ఆరాధించడం, కొనియాడడం.

**7. ముగింపు**

దేవుని ప్రేమ మారనిది, శాశ్వతమైనది. అది యోగ్యులకు ఇచ్చే బహుమతి కాదు, అవసరంలో ఉన్నవారికి ఇచ్చే వరం. ఈ ప్రేమను నిజంగా గ్రహించినప్పుడు, భయం నుండి విముక్తి, గుర్తింపులో స్థిరత్వం, శ్రమల్లో బలం, కృతజ్ఞతతో నిండిన జీవితం కలుగుతుంది.

***“దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము.” (రోమా 8:28)***

నేను దేవుని ప్రేమిస్తే, నా జీవితంలో జరిగేదంతా నా మంచి కోసమే. నేను అనుభవించే ప్రతిదీ – మంచి, చెడు – నా ప్రయోజనం కోసం మరియు దేవుని మహిమ కోసం. నేను దేవుని ప్రేమించకపోతే, నా జీవితంలో ప్రతిదీ నా మంచి కోసమే జరగదు.

నీవు విలువైనవాడవు కనుక దేవుడు నిన్ను ప్రేమించడం లేదు. దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు కనుకనే నీవు విలువైనవాడవు.

ప్రియ నేస్తం, ప్రాణం పెట్టినంతగా ప్రేమించిన దేవుని ప్రేమించటం మరిచావా? సమస్తం వదిలి నీకై వచ్చిన ప్రేమను కొంచమైన ప్రేమింపలేవా?

**రిఫరెన్స్:** "నోయింగ్ గాడ్, జె. ఐ. ప్యాకర్

– **రక్షణ్ శీలం,** గ్రాడ్యుయేట్, కొత్తగూడెం

✦✦✦✦✦✦✦✦

## నూతన శీర్షిక



## మీ ప్రశ్న – మన జవాబులు

**ఫిబ్రవరి నెల ప్రశ్న: బైబిల్ పఠనం: క్వాలిటీ (నాణ్యత) వర్సెస్ క్వాంటిటీ (పరిమాణం)?**

**జవాబు:** బైబిల్ పఠనం నాణ్యతకు సంబంధించిన విషయం


* ప్రతి విశ్వాసి ప్రభువుతో గడపడానికి కచ్చితంగా బైబిల్‌ను ధ్యానిస్తాడు. అయితే, ఎంతసేపు ధ్యానించాడు అనే పరిమాణం (Quantity) కంటే, ఎంత ఏకాగ్రతతో, ఎంత లోతుగా ధ్యానించాడు అనే నాణ్యత (Quality) చాలా ముఖ్యం.
* ప్రభువు సన్నిధిలో కేవలం సమయం గడపడం మాత్రమే కాదు, అది 'నాణ్యమైన సమయం' (Quality Time) అయి ఉండాలి.
* మనం కేవలం పరిమాణంపై (Quantity) దృష్టి పెడితే, అధ్యాయాలకు అధ్యాయాలు చదువుకుంటూ వెళ్తాము తప్ప, వాక్యాన్ని లోతుగా ధ్యానించే సమయం తగ్గిపోతుంది.
* బైబిల్ చదవడం, ధ్యానించడం, అర్థం చేసుకోవడం మరియు అన్వయించుకోవడం – ఇవన్నీ మన అనుదిన జీవితంలో జరగాలి. దీనినే నిజమైన 'క్వాలిటీ టైం విత్ గాడ్' (Quality Time with God) అని అంటారు.
* బైబిల్ మొత్తాన్ని త్వరగా చదివి పూర్తి చేయాలి అనుకోవడం పరిమాణానికి (Quantity) సంబంధించినది. కానీ చదివిన దానిని అర్థం చేసుకొని, ఆ ప్రకారంగా జీవించాలి అనుకోవడం నాణ్యతకు (Quality) సంబంధించిన విషయం.
* అందుకే, విశ్వాసి బైబిల్ కేవలం చదవడం అనేది పరిమాణానికి సంబంధించిన విషయం అయితే, బైబిల్ వాక్యాన్ని లోతుగా ధ్యానించడం అనేది నాణ్యతకు సంబంధించిన విషయం అని చెప్పవచ్చు.
* బైబిల్ ధ్యానిస్తూ ప్రభువుతో మనం ఎంత నాణ్యమైన సమయం గడిపితే, మనకు అంత గొప్ప ఆత్మీయ క్షేమాభివృద్ధి కలుగుతుంది.

**మార్చి నెల ప్రశ్న**

**బైబిల్ ఎందుకు అంత ప్రత్యేకమైనది?**

మీ సమాధానం **ఫిబ్రవరి 10వ** తేదీలోగా పంపించగలరు.

## ఫిబ్రవరి '26 యెహెజ్కేలు గ్రంథము (23 – 24 అధ్యాయాలు)





**అడ్డం**

2. నీవు దానిలోనిది త్రాగి మత్తురాలవై దేనితో నింపబడుదువు?
5. వేటిని చాలునంతగా ఉడికించుము?
8. ఎవరు ఉన్న పట్టణమునకు శ్రమ అని ప్రభువైన యెహోవా చెప్పుచున్నాడు?
9. వారు నేను నియమించిన విశ్రాంతి దినములను ఏ దినములుగా ఎంచిరి?
11. మీరు చేసిన దోషములను బట్టి మీరు ఏమై పోవుదురు?

**నిలువు**

1. ఒహొలీబాయను పేరు దేనికి చెందుచున్నది?
3. దాని కుమారులను కుమార్తెలను పట్టుకొని దానిని దేనిచేత చంపిరి?
4. ఒహొలాయను పేరు దేనికి చెందుచున్నది?
6. నేనును విస్తరించి ఏమి పేర్చబోవుచున్నాను?
7. ఐగుప్తులో నేర్చుకొనిన దేనిని ఇది మానకయుండెను?
9. నీ బట్టలను లాగి వేసి నీ సొగసైన నగలను ఏమి చేయుదురు?
10. ఎవరికి నేను దానిని అప్పగించియున్నాను?

– **కె.కిరణ్ కుమార్,**
స్టాఫ్, మహబూబ్‌నగర్



# బంధాలను బలోపేతం చేద్దాం

**జీవితం అనేది సహజంగానే సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది. మానవులుగా మనమందరం ఒక కుటుంబానికి, ఒక సమాజానికి చెందినవారం. పురుషులైనా స్త్రీలైనా, పిల్లలైనా పెద్దవారైనా, మనం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పదు.**

ఇవ్వడం, తీసుకోవడం అనే బాధ్యతలతో కూడిన మానవ సంబంధాల నుండి విడివిడిగా జీవించడం అసాధ్యం - ఇది శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా అసాధ్యం. ఇది ఒక దైవిక రూపకల్పన, సృష్టి ఆరంభం నుండి ఉన్న ఒక నిజం.

యేసుక్రీస్తులో విశ్వాసులుగా మనం ఒక విశాలమైన కుటుంబంలోకి ప్రవేశించాం – అదే దేవుని కుటుంబం. "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు... ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీయులకు 3:26-28). అయితే మన పాత స్వభావాన్ని అనుసరిస్తే, మన సంబంధాలు అనైతికత, అపవిత్రత, స్వార్థం, విభజన వంటి లక్షణాలతో నిండిపోతాయి. మరి సంబంధాలను ఎలా బలోపేతం చేసుకోవాలి?

## ప్రేమ ద్వారా బంధం

ప్రేమ ద్వారా బంధం - ఇది సంబంధాలను బలపరచే ప్రధాన అంశం. అపొస్తలుడైన పౌలు దేవుని ప్రేమను "సర్వోత్తమమైన మార్గం" అని వర్ణించాడు. 1 కొరింథీ 13వ అధ్యాయంలో చెప్పబడిన ప్రేమ యొక్క పదిహేను లక్షణాలు మనకు దిశానిర్దేశాలు అందిస్తాయి. ఈ లక్షణాలను మనం శ్రద్ధగా ఆచరిస్తే, మన సంబంధాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయి. ఈ లక్షణాలన్నీ మూడు ప్రధాన సద్గుణాలలో సంక్షిప్తీకరించబడతాయి: పరస్పరం ఒకరినొకరు అంగీకరించడం, ఆధారపడటం, వినయం, ఐక్యత.

## ఒకరినొకరు అంగీకరించడం

> **"కాబట్టి క్రీస్తు మిమ్మును చేర్చుకొనిన ప్రకారము దేవునికి మహిమ కలుగునట్లు మీరును ఒకనినొకడు చేర్చుకొనుడి" (రోమా 15:7).**

ఇతరులను వారు ఉన్నట్లుగానే అంగీకరించడం సంబంధాలను పెంపొందించడంలో కీలకం అని పౌలు నొక్కి చెప్తాడు. యేసుక్రీస్తు మనలను ఎలా అంగీకరించాడో– ఎటువంటి షరతులు లేకుండా, మన బలహీనతలతో, అసంపూర్ణతలతో - మనం కూడా అలాగే ఇతర విశ్వాసులను అంగీకరించాలి.

"ఒకరినొకరు" అనే పదం కొత్త నిబంధనలో డెబ్బై ఐదు నుండి వంద సార్లు కనిపిస్తుంది. ఒకరికొకరు అంకితం కావడం, ఒకరినొకరు గౌరవించడం, ఒకరి

నొకరు అంగీకరించడం, ఒకరికొకరు హితవు చెప్పడం, శుభాకాంక్షలు, సేవ చేయడం, ఒకరి భారాలను ఒకరు మోయడం, ఒకరినొకరు సహించడం, చేర్చుకోవడం, మనకంటే ఇతరులను ఘనంగా ఎంచుకోవడం, ప్రోత్సహించడం – ఇలా ఎన్నో విషయాలు ఈ పదంలో కలిసి ఉన్నాయి. ఈ సూత్రాలన్నీ ప్రభువులో సాకార మయ్యాయి. ఆయన నుండి మనం ప్రేరణ పొందాలి. అప్పుడే కుటుంబంలో, సమాజంలో ఆరోగ్య కరమైన, పవిత్రమైన, సామరస్యపూర్ణమైన సంబంధాలను నిర్మించగలుగుతాం.

**తప్పులు వెదకడంలో ప్రమాదం**

నిరంతరం విమర్శించడం, తప్పులు వెదకడం – ఇవి మన సంబంధాలకు ప్రమాదకరం. యేసు ప్రభువు ఇలా అన్నాడు:

> **“నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలోనున్న నలుసును చూచుట యేల?” (మత్తయి 7:3).**

మనం మన తప్పులను చిన్నవిగా చూపించు కుంటూ, ఇతరుల తప్పులను అతిగా చూపిస్తాం. మనం ఇతరులను తీర్పు తీర్చే ముందు మనల్ని మనం తీర్పు తీర్చుకుంటే, వారికి సహాయం చేయడానికి, మన సంబంధాలను బలపరచడానికి కారకు మవుతాం.

సంబంధాల విషయంలో యేసు ప్రభువు యొక్క ప్రమాణాలు చాలా ఉన్నతమైనవి, ఆరోగ్యకరమైనవి. ఇతరుల పట్ల మన ప్రవర్తన, వైఖరులు కఠినంగా లేదా ఖండించేవిగా కాకుండా శ్రద్ధగలవిగా ఉండాలి. మనం మొదట మనల్ని మనం పరిశీలించుకోవాలి, మన తప్పులను సరిదిద్దు కోవాలి, తర్వాత ఇతరులకు సహాయం చేయాలి. ఇది నిర్మాణాత్మక సంబంధాలకు దారితీస్తుంది.

> **మార్గదర్శక సూత్రం:**
> ***“కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది” (మత్తయి 7:12).***

**నాలుకను జాగ్రత్తగా నిర్వహించాలి**

సంబంధాలలో మరో ముఖ్యమైన అంశం మన నాలుకను ఎలా నియంత్రించాలి అనేది. రాజైన దావీదు ఇలా అన్నాడు: “నేనెల్లప్పుడు యెహోవాను సన్నుతించెదను. నిత్యము ఆయన కీర్తి నా నోట నుండును” (కీర్తనలు 34:1). మనకు రుచిని అందించడంతో పాటు, మన నాలుక మాటల ద్వారా మనల్ని వ్యక్తీకరించడానికి, ప్రేమ మరియు శ్రద్ధ చూపించడానికి, ఒకరినొకరు ప్రోత్సహించడానికి, నిర్మించడానికి సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా నిర్వహించకపోతే, మన నాలుక అవమానానికి, నష్టానికి కారణమవుతుంది. సంబంధాలను మెరుగు పరుచుకోవడంలో మన నాలుక ప్రముఖ పాత్ర వహిస్తుంది. సరిగ్గా వాడకపోతే మన నాలుక అగ్నియే (యాకోబు 3:6).

> **గోల్డెన్ రూల్**
> *నోటిని అదుపులో ఉంచుకోవడం నేర్చుకోవాలి. తొందరపడి మాట్లాడి తర్వాత బాధపడే విధంగా మాట్లాడకూడదు. ప్రభువు మన నాలుకలను తన ప్రేమ, అవగాహన, సహనంతో అభిషేకించాలని ప్రార్థించాలి. అప్పుడే మన మాటలు మన జీవిత భాగస్వాములను, పిల్లలను, బంధువులను, మనం కలిసే ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తాయి, దేవుని మహిమపరుస్తాయి.*



### అపరాధ భావం నుండి విముక్తి, నిశ్చయత పొందాలి

తన ఆలోచనాత్మక పుస్తకం “ది స్క్రూటేప్ లెటర్స్”లో, సి.ఎస్. లూయిస్ సాతాను యొక్క ఏజెంట్లు విశ్వాసులను వారి వైఫల్యాల గురించి ఎలా ఆలోచించేలా చేస్తారో వివరిస్తాడు. ప్రజలు తమ గతం, తమ పనితీరు గురించి అపరాధంగా భావించడం ప్రారంభించిన తర్వాత, వారు ఇకపై సాతాను యొక్క ప్రణాళికలను అమలు చేస్తారు. అపరాధ భావం మనలను నిరంతరం, అంతం లేకుండా మింగేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.

మనం దేవుని క్షమను అడగాలి. ఆయన మనల్ని శిక్షించడానికి కాదు, విడిపించడానికే ఇక్కడ ఉన్నాడని గుర్తుంచుకోవాలి. “నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమము లను తుడిచివేయుచున్నాను నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను” (యెషయా 43:25).

మనకు హాని కలిగించారని లేదా మన ప్రతిష్టను దెబ్బతీశారని భావించే వారిని క్షమించడం కూడా మన సంబంధాలను విస్తరింపజేయడంలో సహాయపడుతుంది. మనం ఇతరులను క్షమించినప్పుడు, అది మన జీవితాల్లో దేవుని ఆశీర్వాదాన్ని విడుదల చేస్తుంది. మనం క్షమించనప్పుడు, దేవుడు మన జీవితాల్లో మాత్రమే కాదు, మనం పగ పెంచుకున్న వారి జీవితాల్లో కూడా పనిచేయకుండా మనమే అడ్డుకుంటాం.

**“మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు” (మత్తయి 6:14-15).**

**– కె. సత్యనారాయణ,** కొంపల్లి

* * * * * *

సాక్ష్యం

# దైవ ప్రేమలో నా నూతన ప్రయాణం



**నా** పేరు శ్రీకాంత్. నేను ఒక హిందూ కుటుంబంలో జన్మించాను. నా చిన్నతనంలో మా తల్లిదండ్రులు మా కుల దైవాన్ని, విగ్రహాలను ఆరాధించేవారు. అయితే, కొంతకాలానికి వారు యేసుక్రీస్తు సువార్త విని, ఆయనను విశ్వసించడం జరిగింది. అలా నాకు ఊహ తెలిసినప్పటి నుండి నేను చర్చికి వెళ్లేవాడిని. అయినప్పటికీ, నా హృదయంలో నిజమైన మార్పు కలగలేదు; నేను నా ఇష్టానుసారంగానే జీవించేవాడిని. నా బి.టెక్ మొదటి సంవత్సరం వరకు నా జీవితం అలాగే కొనసాగింది.

### కళాశాల జీవితం మరియు ఆత్మీయ మలుపు

నాకు జేఎన్‌టీయూహెచ్ (JNTUH) లో బి.టెక్ సీటు వచ్చింది. అడ్మిషన్ పూర్తయినప్పటికీ, వెంటనే హాస్టల్ దొరకకపోవడంతో, మా అన్నయ్య స్నేహితుడి ద్వారా అక్కడ పి.జి. హాస్టల్‌లో ఉంటున్న ఒక వ్యక్తి గురించి తెలిసింది. ఆ విధంగా నేను వాళ్ళ రూమ్‌కు వెళ్ళి దాదాపు పది రోజులు అక్కడే ఉన్నాను. నా జీవితంలో అది ఒక గొప్ప మలుపని నేను కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే, ఆ గదిలో నేను ఉండకపోతే, నాకు పంతు అన్న పరిచయం అయ్యేవారు కాదు, తద్వారా నేను యేసుక్రీస్తును వ్యక్తిగతంగా అంగీకరించేవాడిని కాదేమో.

పంతు అన్న మా అన్నయ్య స్నేహితుడికి రూమ్ మేట్. ఆయన నాతో చాలా ప్రేమగా, మర్యాదగా

మాట్లాడేవారు. కొద్ది రోజుల తర్వాత నేను కాలేజీ హాస్టల్ చేరాను. ఒకరోజు పంతు అన్న నన్ను ఒక ఇయు ప్రేయర్ మీటింగ్‌కు తీసుకెళ్లారు. మొదట్లో అక్కడ జరుగుతున్న విషయాలు నాకేమీ అర్థం కాలేదు. ఆ తర్వాత అన్న నన్ను బైబిల్ స్టడీకి పిలిచినప్పుడల్లా, "సమయం వృథా అవుతుంది, ఆ సమయంలో చదువుకోవచ్చు కదా," అని సాకులు చెప్పి తప్పించుకునేవాడిని. కానీ పంతు అన్న నన్ను విడిచిపెట్టకుండా, నా పట్ల శ్రద్ధ చూపిస్తూనే ఉన్నారు. అలా నా బి.టెక్ మొదటి సంవత్సరం పూర్తయింది.

తరువాత పంతు అన్న నన్ను సునీల్ అన్నకు పరిచయం చేశారు. సునీల్ అన్న కూడా నన్ను బైబిల్ స్టడీకి ఆహ్వానించినప్పుడు, నేను మొదటిసారి వెళ్లాను. అక్కడ వారు బైబిల్ స్టడీని నడిపించే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది.

> **"వాక్యాన్ని ఇంత అద్భుతంగా వివరిస్తున్నారేంటి!" అని ఆశ్చర్యపోయాను.**

అప్పటినుండి నేను క్రమం తప్పకుండా బైబిల్ స్టడీలకు హాజరవ్వడం మొదలుపెట్టాను. వాక్యం ద్వారా ఆయనే నిజమైన దేవుడని లోతుగా గ్రహించగలిగాను. అక్కడే నేను యుఇయస్ఐ గురించి తెలుసుకున్నాను.

### ప్రేమ మరియు ఆదరణ

నా విద్యార్థి జీవితంలో నేను కచ్చితంగా పొందుకున్నవి రెండు విషయాలు అని గర్వంగా చెప్పగలను: ఒకటి నిస్వార్థమైన ప్రేమ, రెండు మెంటరింగ్. సీనియర్ అన్న వాళ్ళు నాపై అపారమైన ప్రేమను చూపించేవారు. ఆ ప్రేరణతోనే వారు నన్ను ఇ-క్యాంప్‌కు తీసుకెళ్లారు. ఆ క్యాంపులోనే యేసుక్రీస్తు దేవుడని, రక్షకుడని నాకు సంపూర్ణంగా అర్థమైంది. 2018వ సంవత్సరంలో, అక్కడే నా ప్రతి పాపాన్ని ఒప్పుకొని, యేసును నా సొంత రక్షకునిగా అంగీకరించాను.

ఆ తర్వాత, నేను డిటి, యల్‌టి క్యాంపులకు హాజరై, వాక్యాన్ని ఎలా చదవాలి, పిబియస్, జిబియస్ ఎలా చేయాలో నేర్చుకున్నాను. అన్న వాళ్ళు చూపించిన ఆ క్రీస్తు ప్రేమే, నాకు దేవుని అపారమైన ప్రేమను తెలుసుకోవడానికి సహాయపడింది. దేవుని కృపను బట్టి, విద్యార్థిగా ఉన్నప్పుడు రెండు సంవత్సరాలు దేవుని పనిలో కూడా పాలుపంచుకున్నాను.

2020వ సంవత్సరంలో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, మా నాన్నగారు ఊపిరితిత్తుల వ్యాధితో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో కన్నుమూశారు. అది కరోనా సమయం కావడంతో, మా బంధువులు ఎవరూ మమ్మల్ని పరామర్శించడానికి రాలేకపోయారు. అటువంటి కష్టకాలంలో, యుఇయస్ఐ కుటుంబమే మాకు అండగా నిలిచింది. అన్న వాళ్ళు మా ఇంటికి వచ్చి మమ్మల్ని ఆదరించారు. ముఖ్యంగా దాసరి రాజేష్ అన్న ఆ సమయంలో మమ్మల్ని ఎంతగానో బలపరిచారు. ఆ సందర్భంలో మా అమ్మ గారు అన్న మాటలు నేను ఎప్పటికీ మర్చిపోలేను:

> **"మన సొంత బంధువులు కూడా రాలేని ఈ సమయంలో, మీ యుఇయస్ఐ కుటుంబమే మనకు తోడుగా నిలిచింది."**

ఈ సంఘటన ద్వారా మా కుటుంబం కూడా దేవుని ప్రేమను ప్రత్యక్షంగా రుచిచూడగలిగింది.

### మెంటరింగ్

నా జీవితంలో 'మెంటరింగ్' అనేది అత్యంత కీలకమైన అంశం. ఆత్మీయంగానూ, చదువు విషయంలోనూ నన్ను నడిపించిన గొప్ప మెంటర్స్

నాకు దొరికారు. నాకు ఏ సందేహం వచ్చినా నా మెంటర్‌తో పంచుకునేవాడిని. ముఖ్యంగా సందీప్ రాజ్ అన్న గురించి ఇక్కడ ప్రస్తావించాలి. నేను అన్నను ఎన్నో ప్రశ్నలు అడిగేవాడిని. ఆయన ఎంతో ఓపికతో, నా సందేహాలన్నింటినీ నివృత్తి చేసేవారు. నా పిబియస్, జిబియస్, క్వయిట్ టైం అంశాలను కూడా అన్నతో పంచుకునేవాడిని; ఆయన వాటిని పరిశీలించి, అవసరమైన చోట నన్ను సరిదిద్దేవారు.

చదువు విషయంలో కూడా అన్న వాళ్ళు నన్ను ఎంతగానో ప్రోత్సహించేవారు. ప్రాధాన్యతలను ఎలా నిర్ణయించుకోవాలో నేర్పించారు. ఒకసారి ఒక అన్న నాతో ఇలా అన్నారు:

> **“నేను ఒక విశ్వాసిగా క్లాస్‌లో అందరికంటే టాప్ రావాలని ప్రార్థించేవాడిని.”**

ఆ మాటలు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. నేను కూడా అలాగే ప్రార్థించడం మొదలుపెట్టాను. ఆశ్చర్యకరంగా, ఒక సెమిస్టర్‌లో నేను క్లాస్‌లో ‘థర్డ్ టాపర్’గా నిలిచాను. నాకైతే నమ్మశక్యం కాలేదు, కానీ అది దేవుడు నాకు అనుగ్రహించిన కృప అని అర్థమైంది.

## కెరీర్ గైడెన్స్ మరియు ఉద్యోగం

విద్య, ఆత్మీయతతో పాటు, నా జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలైన ఉద్యోగం మరియు కెరీర్ విషయంలో కూడా రవీందర్ అన్న నన్ను నిరంతరం గైడ్ చేస్తూ ఉండేవారు. అన్న మెంటరింగ్ లేకపోతే నేను ఇప్పుడు ఏ స్థితిలో ఉండేవాడినో నాకే తెలియదు.


నా బి.టెక్ పూర్తయ్యాక, గేట్ మరియు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక సంవత్సరం పాటు ప్రిపరేషన్‌లో ఉన్నాను. గేట్ పరీక్ష రాసిన తర్వాత, రవీందర్ అన్న నాకు ఫోన్ చేసి, “ప్రభుత్వ ఉద్యోగాల కోసం సమయం ఎందుకు వృధా చేస్తున్నావు?” అని మందలించి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ప్రయత్నించమని సలహా ఇచ్చారు. అన్న సూచన మేరకు నేను టిసియస్, ఇన్ఫోసిస్, కాగ్నిజంట్ వంటి కంపెనీలకు అప్లై చేశాను.

కొద్ది రోజుల తర్వాత గేట్‌లో ర్యాంకు వచ్చింది, అదే సమయంలో టిసియస్‌లో జాబ్ ఆఫర్ వచ్చింది, ఇన్ఫోసిస్ మరియు కాగ్నిజంట్‌లో ఇంటర్వ్యూలు ఖరారయ్యాయి. ఈ ఎంపికలన్నీ నా ముందు ఉన్నప్పుడు, “నేను దేనిని ఎంచుకోవాలి?” అని దేవుని అడిగాను. అప్పుడు దేవుడు వాక్యం ద్వారా టిసియస్‌కి వెళ్లమని నాతో మాట్లాడారు. అలా రవీందర్ అన్న గైడెన్స్‌తో మరియు దేవుని నడిపింపుతో నేను టిసియస్‌లో చేరాను.

## ప్రస్తుత పరిచర్య

గత నాలుగు సంవత్సరాలుగా నేను టిసియస్ లోనే పని చేస్తున్నాను. దేవుని కృపను బట్టి నాకు ‘టీం లీడర్’గా ప్రమోషన్ కూడా లభించింది. మొదటి 8 నెలలు ఇంటి నుండే పని చేశాను. ఆ తర్వాత ప్రాజెక్ట్ అవసరాల రీత్యా ఉప్పల్‌లోని హాస్టల్‌లో కొన్ని నెలలు ఉండవలసి వచ్చింది. ఆ సమయంలో రవీందర్ అన్న మళ్లీ నాకు కాల్ చేసి, “మనం పరిచర్యకు దూరంగా ఉండకూడదు, అటాచ్ అయి ఉండాలి,” అని చెప్పి నన్ను రామంతపూర్ జోన్‌కు పరిచయం చేశారు.

రామంతపూర్‌లో అన్న వాళ్ళు నన్ను ఎంతో ప్రేమతో ఆహ్వానించారు. అప్పటినుండి నేను రామంతపూర్ ఇయు, ఇజియఫ్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఆత్మీయంగా ఆయనకు ఇంకా దగ్గరగా జీవించడానికి దేవుడు నాకు సహాయం చేస్తున్నారు.



# ఆరోగ్యకరమైన సరిహద్దులను నిర్ణయించుకోవాలి

ఇయు విద్యార్థిని మయోమి అందరికీ ఇష్టమైన, మంచి మనసు కలిగిన అమ్మాయి. ఆమెను వర్ణించడానికి అందరూ వాడే ఒకే ఒక పదం: "సహాయపడే స్వభావం". మయోమి ఎప్పుడూ ఎవరికీ "వద్దు" అని చెప్పేది కాదు. స్నేహితురాలికి నోట్స్ కావాలంటే, తన చదువు సమయం వృథా అయినా పర్వాలేదు, సంతోషంగా ఇచ్చేది. రాత్రి పొద్దుపోయేలా ఎవరైనా మాట్లాడాలనుకుంటే, తాను ఎంత అలసిపోయినా వింటూ ఉండేది. గ్రూప్ ప్రాజెక్ట్స్, అదనపు సహాయాలు, చివరి నిమిషంలో వచ్చే రిక్వెస్ట్లు, బైబిల్ స్టడీస్, క్రిస్మస్ కార్యక్రమాలు–అన్నీ అంగీకరించేది. "దయగా ఉండటం ముఖ్యం" అని తనకు తాను సర్దిచెప్పుకునేది.

నెమ్మదిగా, ఆమె రోజులు ఇతరుల అవసరాలతో నిండిపోయాయి. ఆమె ఫోన్ నిరంతరం మోగుతూనే ఉండేది. స్టడీ ప్లాన్‌కి మళ్లీ మళ్లీ అంతరాయం ఏర్పడేది. ఏకాగ్రత సాధించడానికి ప్రయత్నించినప్పుడు, "నువ్వు సహాయం చేయకపోతే స్వార్థురాలివి అవుతావు" అనే అపరాధ భావన ఆమె మనసులో గుసగుసలాడేది. అందుకే ఆమె తన పరిమితులను పట్టించుకోలేదు.

పరీక్షలు దగ్గరకు వచ్చేకొద్దీ, మయోమి తీవ్రమైన ఒత్తిడికి, ఆందోళనకు లోనైంది. ఎప్పుడూ ఇతరుల పనుల్లో బిజీగా ఉండడంతో తన సొంత పరీక్షలకు సిద్ధంగా లేదు. ఆమె మార్కులు తగ్గిపోయాయి–అది ఆమెకు సామర్థ్యం లేకపోవడం వల్ల కాదు, సరిహద్దులు నిర్ణయించుకోలేకపోవడం వల్ల జరిగింది. తన సమయాన్ని, శక్తిని, శ్రద్ధను అందరికీ ఇచ్చేసింది–తనకు తప్ప. పరీక్షల రోజు, ఆమె మనసు పూర్తిగా అలసిపోయింది. ఆమె దగ్గర జ్ఞానం ఉంది, కానీ రాసే బలం లేదు. రిజల్ట్స్ వచ్చినప్పుడు, మయోమి ఫెయిల్ అయింది. ఆమె కథ ఒక కీలకమైన సత్యాన్ని తెలియజేస్తుంది: మనం సరిగ్గా సరిహద్దులు నిర్ణయించుకోలేకపోతే, జీవితం అదుపు తప్పిపోతుంది.

## మీ సరిహద్దులను అర్థం చేసుకోవడం

ఆరోగ్యకరమైన సరిహద్దులను ఏర్పరచుకోవాలంటే, మొదట మీరు మీ గురించి మరింత తెలుసుకోవాలి మరియు ప్రభువు నుండి మీకు వచ్చిన ప్రాథమిక పిలుపును అర్థం చేసుకోవాలి. మీ సామర్థ్యాలు మరియు పరిమితులను గుర్తించాలి. మీకు పరిమితమైన వనరులు ఉన్నాయని, మీరు ఒకేసారి అన్ని చోట్ల ఉండలేరని

అంగీకరించాలి. మీరు ఎవరు, మీకు ఏమి కావాలి మరియు ఇతరులు మిమ్మల్ని ఎలా చూడాలని కోరుకుంటున్నారు అనే విషయాల్లో మీతో మీరు నిజాయితీగా ఉండాలి.

> **గుర్తుంచుకోండి:**
> ***సరిహద్దులు భయపెట్టేవి ఎవరినంటే–మీ జీవితంలో ఉండకూడని వారినే.***

మన చుట్టూ ఉన్న వ్యక్తులు మనల్ని ఆరోగ్యకరమైన పరిమితులను దాటేలా ప్రభావితం చేయగలరు. అయితే యేసుక్రీస్తు మనకు పరిపూర్ణ ఆదర్శం. ఆయనను నియంత్రించడానికి ప్రయత్నించిన వారికి యేసు తనను అప్పగించు కోలేదు. జనసమూహం తనను బలవంతంగా రాజుగా చేయడానికి సిద్ధంగా ఉందని యేసు గ్రహించినప్పుడు, ఆయన ఒంటరిగా కొండకు వెళ్ళాడు (యోహాను 6:15). ప్రజలు తనను ఆరోగ్యకరమైన సరిహద్దును దాటేలా ఒత్తిడి చేస్తున్నారని గుర్తించి, యేసు ప్రార్థన కోసం కొండకు ఏకాంతంగా వెళ్లిపోయాడు.

క్రీస్తు కేంద్రంలో ఉన్నప్పుడు, మన సరిహద్దులు చెక్కుచెదరకుండా ఉంటాయి. దేవుని వాక్యం నుండి మన పరిమితులను స్పష్టంగా అర్థం చేసుకున్నప్పుడు, అక్కడ ఆయన ఆజ్ఞలు ఆరోగ్యకరమైన సరిహద్దులను స్థాపిస్తాయి. లేఖనాలను అధ్యయనం చేయడం వల్ల మనం ఈ పరిమితులను నమ్మకంతో నిర్వచించ గలుగుతాము.

ఆరోగ్యకరమైన సరిహద్దులు గోడలు కాదు–అవి గేట్లు మరియు కంచెలు. అవి మీ స్వంత తోటలోని అందాన్ని ఆస్వాదించడానికి మిమ్మల్ని అనుమతిస్తాయి. జీవితంలో గొప్ప విచారాలలో ఒకటి–ఇతరులు కోరుకున్నట్లు మారడం, మీకు మీరుగా ఉండకపోవడం. సరిహద్దులు మీ జీవితాన్ని పరిమితం చేయవు; వాటిని విస్తరింపజేస్తాయి. మీరు ఆరోగ్యకరమైన సరిహద్దును నిర్ణయించిన ప్రతిసారీ, మీరు ఎక్కువ స్వేచ్ఛకు “అవును” అన్నట్లే. వివాహానికి ముందు శారీరక సంబంధాలు, మాదకద్రవ్యాలు, మద్యం మరియు పాపపూరిత ఎంపికలకు “వద్దు” అనే ధైర్యం వచ్చినప్పుడే నిజమైన స్వేచ్ఛ వస్తుంది.

## గౌరవంగా సరిహద్దులను తెలియజేయడం

మన సరిహద్దులు స్పష్టంగా తెలిసిన తర్వాత, స్నేహితులను మరియు కుటుంబ సభ్యులను బాధపెట్టకుండా వాటిని తెలియజేయడం నేర్చుకోవాలి. ఇతరులు మన విలువలను గురించి తెలుసుకునేలా మన సరిహద్దులను తరచుగా వ్యక్తం చేయాలి. తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చడమే తన అత్యున్నత ప్రాధాన్యత అని యేసు తరచుగా తెలియజేశాడు (యోహాను 4:34, 5:19, 5:36). తండ్రి చిత్తమే యేసుకు సరిహద్దుగా ఉండేది, మరియు ఆయన దానిని దాటడానికి నిరాకరించాడు.

> **“ఆరోగ్యకరమైన ‘వద్దు’ మరింత ప్రామాణికమైన ‘అవును’కు దారి తీస్తుంది.”**

సరిహద్దులను నిర్ణయించడానికి గౌరవం, దయ మరియు దృఢత్వం అవసరం. పరిమితులను నిర్ణయించేటప్పుడు ప్రశాంతమైన మరియు తటస్థ స్వరంలో మాట్లాడండి. ఈ విధంగా కమ్యూనికేట్ చేయడం వల్ల ఇతరులు మీ సరిహద్దును వినడానికి మరియు అర్థం చేసుకోవడానికి మరింత సిద్ధంగా ఉంటారు. కోపంగా లేదా నిందించే స్వరంలో మాట్లాడితే రక్షణాత్మకత మరియు ప్రతిఘటన కలుగుతాయి.

మీరు దయతో మరియు ప్రశాంతంగా సరిహద్దును నిర్ణయించడానికి ప్రయత్నించినప్పటికీ ఎవరైనా స్పందించకపోతే, మీరు మీ అభ్యర్థన యొక్క దృఢత్వాన్ని లేదా మీ “వద్దు” యొక్క తీవ్రతను క్రమంగా పెంచవచ్చు. మీ ప్రేక్షకులకు సరిపోయేలా మీ కమ్యూనికేషన్ శైలిని సర్దుబాటు

చేసుకోవడం కూడా ముఖ్యం. జీవిత భాగస్వామితో సరిహద్దులను నిర్ణయించేటప్పుడు మరింత ప్రేమ మరియు దయ అవసరం, కానీ మీ బాస్ లేదా సహోద్యోగులతో మాట్లాడేటప్పుడు మరింత గౌరవం మరియు తటస్థత అవసరం.

**సరిహద్దులను కమ్యూనికేట్ చేయడానికి ఆచరణాత్మక వాక్యాలు**

- "సాయంత్ర వేళల్లో చదువుకోవడానికి నాకు ఏకాంత సమయం కావాలి."
- "ఆ రోజు నేను అందుబాటులో ఉండను"
- "చివరి నిమిషంలో ప్లాన్స్ మారినప్పుడు నేను ఒత్తిడికి గురవుతాను."
- "సహాయం చేయడానికి నేను సంతోషిస్తాను, కానీ ప్రస్తుతం నేను దృష్టి పెట్టాలి"
- "సహాయం చేయడానికి నేను సంతోషిస్తాను, కానీ ప్రస్తుతం నేను నా పనిపై దృష్టి పెట్టాలి"
- "మరొక సారి సహాయం చేయడానికి సంతోషిస్తాను, కానీ ఈరోజు నాకు విశ్రాంతి కావాలి."
- "నేను చెప్పినట్లుగా, నేను అందుబాటులో లేను."
- "అది నాకు సరిపోదు."
- "నేను అర్థం చేసుకుంటున్నాను, కానీ ఇప్పటికీ నా సమాధానం వద్దు."

## ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం

ప్రజలను మెప్పించడం మరియు ప్రభువును మెప్పించడం మధ్య ఎప్పుడూ ఒక సంఘర్షణ ఉంటుంది. ప్రభువును మెప్పించడం మీ ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని ఆశీర్వదిస్తుంది, కానీ మీ చుట్టూ ఉన్న వారి ఆమోదాన్ని ఎప్పుడూ పొందకపోవచ్చు. ఈ రెండు ప్రాధాన్యతల మధ్య చాలా సన్నని రేఖ ఉంది మరియు వివేకం కోసం మీకు దేవుని సహాయం అవసరం.

ప్రజలను మెప్పించడం ద్వారా ప్రజాదరణ పొందడానికి మనం పిలవబడలేదు, కానీ ప్రభువుకు విశ్వాసపాత్రులుగా ఉండటానికి పిలవబడ్డాము. ఏది సులభం: ప్రజలను మెప్పించడం లేదా ప్రభువును మెప్పించడం? ప్రభువును మెప్పించడం కష్టంగా అనిపించవచ్చు ఎందుకంటే ఫలితాలు తక్షణమే కనిపించవు మరియు ఆయన అంచనాలు ఉన్నతమైనవి. అయితే, ప్రభువును మెప్పించడం చివరికి మరింత సంతృప్తికరంగా ఉంటుంది, ఎందుకంటే ఆయన అంచనాలు ఆయన మనకు ప్రసాదించిన సామర్థ్యాలకు నేరుగా అనుపాతంలో ఉంటాయి. మన సామర్థ్యానికి మించి ఆయన ఎప్పుడూ ఆశించడు.

**"ఇప్పుడు నేను మనుష్యుల దయను సంపాదించుకొన జూచుచున్నానా దేవుని దయను సంపాదించుకొన జూచుచున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్టగోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోషపెట్టువాడనైతే క్రీస్తుదాసుడను కాకయేపోవుదును." – గలతీయులకు 1:10**

పౌలు ఇలా స్పష్టం చేస్తున్నాడు: మీరు దేవుని మెప్పించవచ్చు లేదా ప్రజలను మెప్పించవచ్చు– రెండూ చేయలేరు. వ్యక్తిగత శ్రేయస్సు స్వార్థం కాదు, అది బాధ్యతాయుతమైన నిర్వహణ. మీరు ప్రజలను మెప్పించడానికి ప్రయత్నించినప్పుడు, మీ శక్తి క్షీణిస్తుంది. మీరు ఒత్తిడికి గురవుతారు, అలసిపోతారు, అలసట అనుభవిస్తారు, కానీ స్పష్టమైన ఆధ్యాత్మిక ఫలితం ఏముండదు. ఆరోగ్యకరమైన సరిహద్దులను నిర్ణయించడం ఇతరుల స్వేచ్ఛను గౌరవించడంలో మరియు మన స్వంత స్వేచ్ఛను రక్షించుకోవడంలో మనకు సహాయపడుతుంది.

## సరిహద్దు ఉల్లంఘనలను గుర్తించడం

సరిహద్దు ఉల్లంఘన అంటే ఎవరైనా మీరు పేర్కొన్న లేదా సూచించిన పరిమితులను

విస్మరించడం, కొట్టివేయడం లేదా పదేపదే దాటడం. మీరు మీ సరిహద్దులను నిర్వచించి మరియు నిర్వహించినప్పుడు స్నేహితులకు అసౌకర్యంగా అనిపించవచ్చు. మీరు ఏర్పరుచుకున్న పరిమితులను ఉల్లంఘించేలా వారు మిమ్మల్ని ఒత్తిడి చేయడానికి అనేక ప్రయత్నాలు చేయవచ్చు.

సరిహద్దు ఉల్లంఘనలు ఎప్పుడూ బాహ్య ఒత్తిడి నుండి రావు; తరచుగా, మనం మన స్వంత పరిమితులను విస్మరించినప్పుడు అవి లోపల నుండి తలెత్తుతాయి. మీరు శాంతికి బదులు ఒత్తిడిని అనుభవించినప్పుడు, మీరు అలసిపోయినట్లు, కోపంగా లేదా విఫలమైనట్లు అనిపించినప్పుడు-ఇవి సరిహద్దు ఉల్లంఘనలను సూచించే అంతర్గత సంకేతాలు. ఉల్లంఘించబడిన సరిహద్దు యొక్క ఒక ప్రధాన సంకేతం: ఆ తర్వాత వచ్చే నిశ్శబ్దమైన, నిరంతర అపరాధ భావన.

దేవుని వాక్యం ద్వారా మనం నిరంతరం పోషణ పొందుతున్నప్పుడు, సరిహద్దులు ఎప్పుడు ఉల్లంఘించబడుతున్నాయో గుర్తించడానికి మనకు స్పష్టత మరియు వివేకం వస్తుంది. లేఖనం మన మనస్సాక్షిని పదును పెడుతుంది. సంసోను దేవుని మాటకు దూరమైనప్పుడు, అతను ప్రమాదాన్ని గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయాడు మరియు సరి హద్దు ఉల్లంఘనలు అతన్ని నెమ్మదిగా శత్రువు ఉచ్చులోకి తీసుకెళ్లాయి.

'కాబట్టి మీరు కుడికేగాని యెడమకేగాని తిరుగక మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించినట్లు చేయుటకు జాగ్రత్తపడవలెను. మీరు స్వాధీన పరచుకొనబోవు దేశములో మీరు జీవించుచు మేలుకలిగి దీర్ఘాయుష్మంతులగునట్లు మీ దేవుడైన యెహోవా మీకు ఆజ్ఞాపించిన మార్గములన్నిటిలో నడుచుకొనవలెను." - ద్వితీయోపదేశకాండము 5:32-33

### స్వీయనియంత్రణకు బైబిల్ ఆధారం

స్వీయనియంత్రణ మనలో పనిచేస్తున్న ఆత్మ కార్యానికి సాక్ష్యమే. ఇది కేవలం స్వీయ-క్రమశిక్షణ కాదు; ఇది ఆత్మ-ప్రేరేపిత సంయమనం మరియు జ్ఞానం-ఆత్మఫలం. పరిశుద్ధాత్మతో నిండిన జీవితం ఆత్మనియంత్రణ అనే ఫలాన్ని ఇస్తుంది, ఇది మన సరిహద్దుల గురించి స్పష్టత మరియు వివేకాన్ని తెస్తుంది.

మనం తరచుగా ఇతరులను, పరిస్థితులను నిర్వహించడంలో విజయం సాధిస్తాము, కానీ మన స్వంత హృదయాలను నియంత్రించడంలో కష్టపడుతాము. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అతి ముఖ్యమైన పనిని విస్మరిస్తాము: ఆత్మనియంత్రణ. మానవ స్వభావం బాహ్య విషయాలను నియంత్రించడానికి మనల్ని నెడుతుంది, కానీ నిజమైన ఆధ్యాత్మిక పరిపక్వత ఆత్మనియంత్రణతో ప్రారంభమవుతుంది. ఇతరులను మార్గనిర్దేశం చేయడం కంటే మనల్ని క్రమశిక్షణలో ఉంచు కోవడం కష్టం. అందుకే లేఖనం మనల్ని మొదట ఆత్మనియంత్రణకు పిలుపునిస్తుంది.

గలతీయులకు 5:23 ఆత్మనియంత్రణను ఆత్మఫలంగా చెబుతుంది, వ్యక్తిత్వం లేదా శక్తి యొక్క ఫలితం కాదు. అలాగే, 1 కొరింథీయులకు 9:27లో పౌలు తనను తాను క్రమశిక్షణలో ఉంచుకోవడాన్ని చూపిస్తుంది, ఇతరులను కాదు. ఇక్కడ ఒక సత్యం ఉంది: తనను తాను పాలించుకోవడం కంటే ఒక నగరాన్ని పాలించడం సులభం. కానీ పరిశుద్ధాత్మ మన హృదయాలను పాలించినప్పుడు, మనం ఇకపై ఇతరుల పై ఆధిపత్యం చెలాయించాల్సిన అవసరం లేదు- ఎందుకంటే మనం లోపలి నుండి పాలించబడు తున్నాము.

**సరిహద్దు ఉల్లంఘనలకు**
**కారణమయ్యే గొప్ప శత్రువు ఎవరు? మీరే.**

ఆత్మనియంత్రణ మన ఆలోచనలు, భావోద్వేగాలు

మరియు ఎంపికలలోకి ప్రవేశించే దానిని మనం ఎలా కాపాడుకుంటామో చూపిస్తుంది. “ప్రాకారము లేక పాడైన పురము ఎంతో తన మనస్సును అణచుకొనలేనివాడును అంతే” (సామెతలు 25:28). గోడలు రక్షణను సూచిస్తాయి; ఆత్మనియంత్రణ లేకపోతే, జీవితం బహిర్గతమయ్యి బలహీనంగా మారుతుంది.

### సోషల్ మీడియా మరియు ఆత్మనియంత్రణ

సోషల్ మీడియా మన దృష్టిని ఆకర్షించడానికి రూపొందించబడింది, కానీ ఆత్మనియంత్రణ మన సమయం దేవునికి చెందినదని మనకు గుర్తు చేస్తుంది. అంతులేని స్క్రోలింగ్‌తో నియంత్రించబడటానికి బదులు ఎప్పుడు నిమగ్నమవ్వాలో మనం ఎంచుకోవాలి. నియంత్రణ లేని సోషల్ మీడియా పోలిక, ఆందోళన, కామం లేదా కోపానికి దారితీయవచ్చు. ఆత్మనియంత్రణ మన ఆలోచనలు మరియు భావోద్వేగాలను కాపాడే సరిహద్దుగా పనిచేస్తుంది.

**సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేయడానికి అనుసరించదగిన ఆచరణాత్మక నియమాలు:**

- ప్రతి రోజు బైబిల్ చదవడం లేదా ప్రార్థన చేసుకోవడం పూర్తి అయ్యే వరకు సోషల్ మీడియా వాడకూడదు.
- వాడేటప్పుడు టైమర్‌ను ఉపయోగించాలి; అది మోగిన వెంటనే ఆపాలి.
- నిద్రించేముందు, ముఖ్యంగా రాత్రి వేళల్లో సోషల్ మీడియా వాడకూడదు.

### ముగింపు

ఆరోగ్యకరమైన సరిహద్దులు ప్రజలను దూరంగా ఉంచడానికి గోడలు కావు, కానీ దేవుడు మనకు అప్పగించిన దానిని రక్షించే దేవుడిచ్చిన పరిమితులు. మనం దయ మరియు స్పష్టతతో సరిహద్దులను కమ్యూనికేట్ చేసినప్పుడు, మనం ఇతరులను మరియు మనల్ని గౌరవిస్తాము. ప్రజలను మెప్పించడం కంటే ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని ఎంచుకోవడం స్వార్థం కాదు–అది నమ్మకమైన నిర్వహణ.

సరిహద్దు ఉల్లంఘనలను గుర్తించడం మరియు తెలివిగా ప్రతిస్పందించడం నేర్చుకున్నప్పుడు, మనం అపరాధ భావన లేదా భయం కంటే పరిపక్వతతో నడుస్తాము. అంతిమంగా, ఈ విధంగా జీవించే శక్తి పరిశుద్ధాత్మ నుండి వస్తుంది; ఆయనే మనకు ఆత్మనియంత్రణను కలుగచేస్తాడు మరియు దేవుని మహిమ కోసం మన సమయాన్ని, శక్తిని మరియు పిలుపును ఉపయోగించడం నేర్పిస్తాడు.

**ప్రార్థన:** ప్రభువా, నీ పరిశుద్ధాత్మతో మమ్మల్ని కొత్తగా నింపుము. మా సరిహద్దులతో నిన్ను గౌరవించడం నేర్పించుము మరియు సమతుల్యత, విధేయత మరియు ఫలవంతమైన జీవితాలను గడపడానికి మాకు కృపను దయజేయుము. ఆమెన్.

– **సురేష్ అర్జా,** వరంగల్

* * * * * *

## జనవరి ‘26 యెహెజ్కేలు గ్రంథము (21 – 22 అధ్యాయాలు)

**అడ్డం:** 3. దక్షిణ, 4. ఆడు సింహము, 5. నా హస్తము, 6. బబులోను, 7. విశ్రాంతి, 9. ఐగుప్తుదేశమునకు.

**నిలువు:** 1. దూషణ, 2. కొదమ సింహములు, 5. నా విధులను, 6. బహురౌద్రము, 8. తిరుగుబాటు.

**విజేతలు:**

1. జ్యోతి గంగారాం, కొంపల్లి, 2. మేసు స్వప్న తుకారం, రాజన్న సిరిసిల్ల



# గోధుమ గింజ జోసెఫ్ అభిషేకరావు

## (1947–1971)

## యుఇయస్ఐ–ఏపీ విద్యార్థి ఉద్యమ మార్గదర్శి

**జోసెఫ్ అభిషేకరావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యూనియన్ ఆఫ్ ఇవాంజలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా (యుఇయస్ఐ) విద్యార్థి పరిచర్యకు పునాది వేసిన మార్గదర్శి. పరివర్తన చెందిన ఒకే ఒక్క వ్యక్తి “గోధుమ గింజ” వలె భూమిలో పడి, తన త్యాగపూరిత జీవితం ద్వారా తెలుగు రాష్ట్రాల విద్యార్థుల మధ్య విస్తారమైన పంటకు కారణమయ్యాడు. అతని వ్యక్తిగత పరివర్తన, అనుసరించిన వ్యూహాత్మక పద్ధతులు, ప్రధాన నాయకత్వ సూత్రాలు నేటికీ మనకు కర్తవ్యాన్ని నిర్దేశిస్తాయి.**

### ప్రారంభ జీవితం – పరివర్తనకు ముందు

1947, అక్టోబర్ 15న రాజమండ్రిలో జన్మించిన జోసెఫ్ అభిషేకరావు జీవితం ప్రభువును అంగీకరించే ముందు పూర్తిగా భిన్నమైన మార్గంలో సాగింది. అతనికి తెలిసిన ఒక స్త్రీ అతనిని “భయంకరమైన వ్యక్తి” అని వర్ణించింది. అతని పూర్వ జీవితంలోని ప్రధాన లక్షణాలు చూస్తే– ఇతరులను మోసగించడం, తరచుగా అబద్ధాలు చెప్పడం, పశ్చాత్తాపం లేకుండా దొంగతనాలు చేయడం అతని నైజం.

అతని ప్రవర్తన ఎంత తీవ్రంగా ఉండేదంటే, “ఈ జోసెఫ్ ఉన్న రోడ్లో ఒక ఆడపిల్ల కళాశాలకు వెళ్లాలంటే భయపడేది” అని ప్రజలు చెప్పుకునేవారు. అతని ప్రవర్తన, సంఘంలో మంచి పేరున్న అతని తల్లిదండ్రులకు తీవ్రమైన అవమానాన్ని మరియు బాధను కలిగించింది. ఈ విధ్వంసకర ప్రవర్తన ఉన్నప్పటికీ, అతను స్టూడెంట్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ (SCM)లో చురుకుగా పాల్గొంటూ, నాయకత్వ పదవిని కూడా నిర్వహించడం అతని జీవితంలోని వైరుధ్యాన్ని స్పష్టంగా చూపుతుంది.

### హైఫీల్డ్ క్యాంప్ – జీవిత మలుపు

మే 1966లో నీలగిరిలోని హైఫీల్డ్‌లో జరిగిన యుఇయస్ఐ క్యాంప్ అతని జీవితాన్ని శాశ్వతంగా మార్చివేసింది. 1965లో అతని తల్లిదండ్రులు రాజమండ్రి నుండి విజయవాడకు మారిన తర్వాత,

అతను ఆంధ్ర లయోలా కళాశాలలో చేరాడు. ఢిల్లీలో ఇంజనీరింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న అతని అన్నయ్య ఇజ్రాయెల్ భాస్కర్ రావు ప్రోత్సాహంతో అతను ఆ శిబిరానికి హాజరయ్యాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల నుండి ఆ శిబిరానికి హాజరైన ఏకైక విద్యార్థి జోసెఫ్ మాత్రమే. మొదట్లో, అతనికి వ్యక్తిగత విశ్వాసం లేదు.

శిబిరంలో, అతను తీవ్రమైన మేధో మరియు ఆధ్యాత్మిక సంఘర్షణను అనుభవించాడు. క్యాంప్ స్టాఫ్ సభ్యుడైన పి.సి. వర్గీస్‌తో అతను తీవ్రంగా వాదించాడు. తన పాపాల గురించి, క్షమాపణ యొక్క సాధ్యత గురించి తనలో రేగిన ప్రశ్నలకు సమాధానంగా, వర్గీస్ యెషయా 1:18 వచనాన్ని చూపించారు:

**"నీ పాపములు రక్తము వలె ఎర్రవైనను అవి హిమము వలె తెల్లబడును."**

ఈ వాక్యం అతని హృదయాన్ని లోతుగా తాకింది. శిబిరం ప్రారంభమైన మూడవ రోజు, జోసెఫ్ తన జీవితాన్ని క్రీస్తుకు సమర్పించుకున్నాడు. ఆ క్షణంలో, అతను "చీకటి" నుండి వర్ణించలేని సంతోషంతో నిండిన వ్యక్తిగా రూపాంతరం చెందాడు.

## పున:నిర్మించబడిన జీవితం

శిబిరం నుండి తిరిగి వచ్చిన వెంటనే జోసెఫ్ జీవితంలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. అతని పరివర్తన కేవలం భావోద్వేగ అనుభవం కాదు, అది అతని క్రియలలో స్పష్టంగా వ్యక్తమైంది. జక్కయ్య వలె, అతను తన గతాన్ని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాడు. తాను అన్యాయంగా డబ్బు తీసుకున్న లేదా నష్టపరిచిన ప్రతి వ్యక్తికి తిరిగి చెల్లించడం ప్రారంభించాడు.

నిరుద్యోగి అయినప్పటికీ, నెలవారీ వాయిదాల పద్ధతిలో కూడా అప్పులను తీర్చడం అతని నూతన నైతిక బాధ్యతకు నిదర్శనం. అతని తండ్రి తన పలుకుబడిని ఉపయోగించి ఒక పొగాకు కంపెనీలో ఉద్యోగం ఇప్పించారు. అయితే, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే సిగరెట్లను తయారు చేసే పరిశ్రమలో పనిచేయడం తన క్రైస్తవ సూత్రాలకు విరుద్ధమని భావించి, ఆ ఉద్యోగాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు.

ఈ చర్య అతని తండ్రికి కోపం తెప్పించినప్పటికీ, అతని కొత్త విశ్వాసం ఎంత దృఢంగా, రాజీపడ లేనిదిగా ఉందో నిరూపించింది. ఈ నూతన నైతిక ధృడత్వం మరియు త్యాగపూరిత నిశ్చయత కేవలం వ్యక్తిగత మార్పుకే పరిమితం కాలేదు; అది త్వరలోనే ఆంధ్రప్రదేశ్ విద్యార్థి లోకాన్ని చేరడానికి అతను రూపొందించిన ధైర్యమైన వ్యూహాలకు చోదక శక్తిగా మారింది.

## దార్శనిక వ్యూహకర్త

జోసెఫ్ అభిషేకరావు యొక్క ప్రభావం కేవలం అతని వ్యక్తిగత ఉత్సాహం నుండి మాత్రమే ఉద్భవించలేదు; అది ప్రార్థన, సమాచారం, నిర్భయమైన చొరవ అనే మూడు స్తంభాలపై నిర్మించబడిన ఒక క్రమబద్ధమైన వ్యూహం యొక్క ఫలితం. ఆధునిక సాంకేతికత లేని కాలంలో, ఒక విద్యార్థి ఉద్యమాన్ని మొదటి నుండి నిర్మించడానికి అతను ప్రణాళికాబద్ధమైన మరియు పద్ధతైన విధానాలను ఉపయోగించాడు.

## ప్రార్థన మరియు సమాచారం యొక్క శక్తి

రాష్ట్రవ్యాప్త పరిచర్యను ప్రారంభించడానికి, జోసెఫ్ సమాచార సేకరణ మరియు ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను గుర్తించాడు. అతను 1968-69 సంవత్సరానికి "ఆంధ్రప్రదేశ్ సువార్తిక సమాఖ్యల ప్రార్థన పత్రిక"ను సృష్టించాడు. ఆంధ్రప్రదేశ్ పటాన్ని తన వద్ద ఉంచుకుని, రాష్ట్రంలోని అన్ని కళాశాలల గురించి సమగ్ర సమాచారాన్ని, గణాంకాలను సేకరించి, ఆ డేటాను ఒక వ్యూహాత్మక ప్రార్థన వనరుగా సంకలనం చేశాడు.

ఆ ప్రార్థన పత్రికలో "ఈ పత్రిక చెత్త కుండీలో వేయడానికి కాదు, పట్టుదలతో ప్రార్థించడానికి" అనే ఒక సూటియైన హెచ్చరికను జతచేసేవాడు మరియు ప్రతి సభ్యుని నుండి క్రియాశీల, ప్రార్థనాపూర్వక జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశాడు.

## ధైర్యంతో విద్యార్థి బృందాలను ప్రారంభించడం

జోసెఫ్ అభిషేకరావు కేవలం ప్రార్థనతో ఆగిపోలేదు; అతను చొరవ తీసుకుని నేరుగా రంగంలోకి దిగాడు. అతని "చొచ్చుకుపోయే విధానం" విద్యార్థి సమూహాలను ప్రారంభించ డంలో కీలక పాత్ర పోషించింది. ఒక కొత్త కళాశాలకు వెళ్లి, అక్కడ ఉన్న క్రైస్తవ విద్యార్థుల జాబితాను సంపాదించి, వారిని నేరుగా సంప్రదించి బైబిల్ స్టడీ ప్రారంభించమని అడగడం అతని పద్ధతి.

విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశా లలో ప్రొటెస్టెంట్ కరపత్రాలను పంపిణీ చేసి నందుకు వ్యతిరేకత ఎదురైనప్పటికీ, అతను నిరుత్సాహపడకుండా తన పనిని కొనసాగించాడు.

## పూర్తికాల పరిచర్యకు పిలుపు

ఫిబ్రవరి 1968లో, జోసెఫ్ అభిషేకరావు పూర్తికాల పరిచర్యకు దేవుని నుండి స్పష్టమైన పిలుపును తెలుసుకున్నాడు. లూకా 4:18 వచనం అతని హృదయాన్ని తాకింది. ఈ పిలుపును దేవుడు ఒకే ఆదివారం నాడు మూడు విధాలుగా ధృవీకరించాడు: అతని వ్యక్తిగత పఠనంలో, చర్చిలో పాస్టర్ గారి ప్రసంగంలో మరియు అతను వెళ్ళిన లైబ్రరీలోని బ్లాక్ బోర్డు మీద అదే వాక్యం వ్రాసి ఉండటంతో. ఈ తిరుగులేని ధృవీకరణ తర్వాత, అతను యుఇయస్ఐ స్టాఫ్‌గా చేరడానికి దరఖాస్తు చేసుకున్నాడు. మానవుడు మొదటిసారి చంద్రునిపై అడుగుపెట్టిన రోజైన జూలై 21, 1969న, జోసెఫ్ అభిషేకరావు యుఇయస్ఐ స్టాఫ్‌గా నియమించబడ్డాడు–ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి పరిచర్యకు అది ఒక చారిత్రాత్మక ఘట్టం.

## దృఢమైన సంకల్పం, ఏక లక్ష్యం

జోసెఫ్ అభిషేకరావు నాయకత్వం యొక్క ప్రభావం అతని పద్ధతులలో మాత్రమే కాకుండా, అతని వ్యక్తిత్వంలో కూడా ఉంది. అతని నాయకత్వం తీవ్రమైన ఏకాగ్రత, దైవిక ఆవశ్యకత యొక్క బలమైన భావన మరియు ప్రార్థనపై సంపూర్ణ ఆధారపడటం వంటి ప్రధాన లక్షణాల కలయిక.

అతని స్నేహితుడు సహోదరుడు దీనబంధు అతనిని ***"ప్రార్థనాపరుడు, ఏక లక్ష్యం గల, తృష్ణ కలిగిన కార్యశూరుడు"*** అని వర్ణించాడు. ఈ ఏక లక్ష్యం అతని మాటలలో మరియు ప్రార్థనలలో ప్రతిధ్వనించింది.

> ***"ఆంధ్రాన్ని నాకు ఇవ్వు లేదా చస్తాను."***

స్కాట్లాండ్ కోసం జాన్ నాక్స్ చేసిన ప్రార్థనను స్ఫూర్తిగా తీసుకుని, అతను తన స్నేహితులను ఇలా సవాలు చేసేవాడు. ఈ మాటలు ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల పట్ల అతనికున్న అపారమైన భారాన్ని మరియు తపనను తెలియజేస్తాయి.

## త్యాగపూరిత సేవ

జోసెఫ్ అభిషేకరావు తన పరిచర్యను ఒక సాధారణ ఉద్యోగంగా కాకుండా, ఒక అత్యవసరమైన దైవిక పిలుపుగా భావించాడు. ఒక సహోద్యోగి పరిచర్యను అంత తీవ్రంగా తీసుకోవద్దని సలహా ఇచ్చినప్పుడు, అతను ప్రవచనాత్మకంగా ఇలా సమాధానమిచ్చాడు: "నేను ఎంత కాలం బతుకు తానో నాకు ఎలా తెలుసు? అందుచేత నేను చేయగలిగినంత ఇప్పుడే చేయాలి."

ఈ ఆవశ్యకత అతని పనితీరులో స్పష్టంగా కనిపించింది. దీర్ఘకాలికంగా మరియు బాధాకర మైన అల్సర్‌తో బాధపడుతున్నప్పటికీ, అతను

తన ఆరోగ్యాన్ని లేదా సౌకర్యాన్ని లెక్కచేయకుండా అవిశ్రాంతంగా ప్రయాణిస్తూ, హాస్టళ్లలో బైబిల్ స్టడీలను స్థాపించాడు.

## ప్రార్థనపై నిర్మించిన పునాది

జోసెఫ్ అభిషేకరావు యొక్క తీవ్రమైన కార్యకలాపాలన్నింటికీ పునాది అతని ప్రార్థన జీవితం. అతని సహోద్యోగులు, ముఖ్యంగా సహోదరుడు విశాల్ మంగళవాడి, అతని ప్రార్థన నిబద్ధతకు సాక్ష్యమిచ్చారు.

> ***అతని దినచర్య ప్రార్థనతోనే ప్రారంభమై, ప్రార్థనతోనే ముగిసేది. ప్రతి ఉదయం, ఇతరులు నిద్రలేవక ముందే అతను మోకాళ్లపై ఉండి ప్రార్థనలో మరియు వాక్య పఠనంలో గడిపేవాడు. ప్రతి రాత్రి, పగటిపూట తన అహంభావంతో చేసిన పనులకు క్షమాపణ కోరుతూ మోకాళ్లపై ప్రార్థించేవాడు. అతని జీవితం ప్రార్థనలో మునిగిపోయింది మరియు అతని పరిచర్య ఆ ప్రార్థనల నుండి పుట్టిన ఫలమే.***

## సమృద్ధిగా ఫలించిన విత్తనం

యోహాను 12:24లో చెప్పబడినట్లుగా, జోసెఫ్ అభిషేకరావు జీవితం భూమిలో పడి చనిపోయి విస్తారంగా ఫలించిన "గోధుమ గింజ"కు ప్రబలమైన ఉదాహరణ. అతని జీవితం కేవలం 23 సంవత్సరాలకే విషాదకరంగా ముగిసినప్పటికీ, అతని పరిచర్య ఫలాలు నేటికీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

జోసెఫ్ అభిషేకరావు యొక్క ప్రభావం అతనితో కలిసి పనిచేసిన వారి సాక్ష్యాల ద్వారా స్పష్టమవుతుంది. అతని జీవితం అనేకమందిపై చెరగని ముద్ర వేసింది. అప్పటి స్టాఫ్ సహోదరుడు చాంద్ పిళ్ళ, "అంకితభావం మరియు ఉత్సాహం గల క్రీస్తు సేవకుడు ఎలా ఉండాలో రావు చాలా తక్కువ సమయంలోనే చూపించాడు" అని పేర్కొన్నాడు. సహోదరుడు సత్యకీర్తి రావు – రావు సమాధి వద్ద మోకరిల్లి, అతని సాక్ష్య జీవితాన్ని బట్టి దేవునికి స్తుతులు చెల్లించినట్లు తెలియజేశారు.

## ఒకే విద్యార్థి నుండి వర్ధిల్లుతున్న ఉద్యమం వరకు

జోసెఫ్ అభిషేకరావు పట్టుదల ప్రార్థనకు అతిపెద్ద నిదర్శనం అతను ప్రారంభించిన ఉద్యమం యొక్క పెరుగుదల. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల నుండి యుఇయస్ఐ శిబిరానికి హాజరైన ఏకైక విద్యార్థిగా అతను ప్రయాణాన్ని ప్రారంభించాడు. నేడు, యుఇయస్ఐ శిబిరాలకు మరియు సమావేశాలకు వందలాది, వేలాది మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ అద్భుతమైన పెరుగుదల జోసెఫ్ అభిషేకరావు యొక్క పునాది పని, అవిశ్రాంతమైన సేవ మరియు తీవ్రమైన ప్రార్థనల ప్రత్యక్ష ఫలితం.

## ముగింపు

జోసెఫ్ అభిషేకరావు 1971 మార్చి 1న తీవ్ర అనారోగ్యంతో మరణించారు. ఆయన జీవితం, విషాదకరంగా చిన్నదైనప్పటికీ, పరివర్తనాత్మక నాయకత్వానికి ఒక శాశ్వతమైన సాక్ష్యంగా నిలుస్తుంది. అతని వారసత్వం అతను జీవించిన సంవత్సరాల సంఖ్యలో కాదు, అతని విశ్వాసం యొక్క లోతులో, అతని దృష్టి యొక్క స్పష్టతలో, మరియు అతని త్యాగపూరిత జీవితం నుండి పుట్టి, నేటికీ ఫలమిస్తున్న శాశ్వత ఉద్యమంలో ఉంది.

అతను నాటిన విత్తనం వాస్తవంగా విస్తారమైన పంటను ఇచ్చింది. విద్యార్థి లోకాన్ని చేరుకోవాలనే దర్శనంతో ముందుకు సాగుతున్న మనందరికీ జోసెఫ్ అభిషేకరావు జీవితం స్ఫూర్తినివ్వగలదని ఆశిస్తున్నాను.

***(పై వ్యాసం యుఇయస్ఐ పబ్లికేషన్ ట్రస్ట్ వారు ప్రచురించిన 'గోధుమ గింజ జోసెఫ్ అభిషేకరావు జీవిత చరిత్ర' అను పుస్తకము నుండి మరియు ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించబడినది)***

**– రూత్ వినయ్,** ప్రగతినగర్, సైబరాబాద్

కథానిక



# పారిపోవడానికి కాదు బ్రో... పరిగెత్తడానికి

జీవితం ఒక పరుగు పందెం లాంటిది. ఒక్కోసారి ఊపిరి సలపనంత పని ఉంటుంది. తినడానికి, తాగడానికి కూర్చున్నా, మనసులో చేయాల్సిన పనుల గురించే ఆలోచనలు తిరుగుతుంటాయి. పెట్టుకున్న టార్గెట్ రీచ్ అవ్వాలనే తపన ఎప్పుడూ ఉంటుంది. ఆ టార్గెట్ రీచ్ అవ్వాలంటే ఆ రోజుకు ఓ ప్లాను వేసుకోవాలి. చేయాల్సిన పనులన్నీ ఓ కాగితం ముక్క మీద రాసుకొని, 'ప్రయారిటీ' బేసిస్‌గా దానికి నంబరింగ్ ఇస్తాం. అది మనకు కనబడేటట్లుగా గోడకో, తలుపుకో అతికించుకుంటాం. ఒక్కో పని చేసుకుంటూ పోతూ, ఆ లిస్ట్‌లో చేసిన పనులకు టిక్ మార్కు పెట్టుకుంటూ వెళ్తే... ఆ రోజు చివరలో టార్గెట్ రీచ్ అయ్యామంటే... ఆ థ్రిల్ వర్ణనాతీతం... అది నిజంగా నెక్స్ట్ లెవలే బ్రో!

"అసలు నువ్వేం చేయాలనుకుంటున్నావ్? నువ్వు చేయాలనుకుంటున్న పనులు నాకెందుకు చెప్తున్నావ్? నీ పనుల గురించి చెప్పడానికి ఇంత 'సుత్తి' ఎందుకు అనే కదా బ్రో నీ డౌట్? అలా చెప్పడంలో... పనులు పూర్తి చేయడంలోనే అసలైన మజా ఉంది బ్రో.

******

అయ్యో బాబోయ్! నేనెందుకు ఇలా తయారయ్యాను? అచ్చం రీల్స్‌లో లాగానే మాట్లాడుతున్నాను. ఇందాక "పని ఎలా చేసుకోవాలో" చెప్పిన విషయాలు సరదాగా అద్దంలో చూసుకుంటూ చెప్పినవే. ఇదంత కొంచెం సరదాగానే అనిపించినా, ఈ 'రీల్స్' ప్రభావం నా మీద చాలా తీవ్రంగా పడిందని నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది.

గతంతో నేను ఇంతకుముందులా ప్లాన్ చేసుకుని కాగితపు ముక్కపై రాసుకుని, గోడకో తలుపుకో అతికించుకుని, ఒక్కో పనిని పూర్తిచేస్తూ టిక్ పెట్టుకునేవాడిని. కానీ ఇప్పుడు ఆ విధానం పూర్తిగా దెబ్బతింది.

గోడ మీద స్టికీ నోట్స్, ప్లాన్లు దర్శనమిస్తున్నాయి కానీ, అవి అచరణలోకి రావడం లేదు. గంటలకు గంటలు రీల్స్ స్క్రోల్ చేయడంలో సమయం ప్రవాహంలా కొట్టుకుపోతోంది. చూస్తున్న కొద్దీ ఇంకా ఇంకా చూడాలనే కోరిక పుడుతుందే తప్ప, ఆపాలని మాత్రం అనిపించడం లేదు.

నా ఆలోచనలకు బ్రేక్ వేస్తూ అమ్మ గొంతు వినిపించింది.

"అరె! ఎంత సేపు రెడీ అవుతావు? ఈ కాలంలో అబ్బాయిలు కూడా అమ్మాయిల్లాగే గంటలు గంటలు రెడీ అవుతున్నారబ్బా!"

అమ్మ కేకకు ఉలిక్కిపడి బయటకొచ్చాను. "అమ్మ ఏంటి పిలిచావ్? కాదు కాదు... అరిచావ్ అన్నాను."

"మీ నాన్న బిజీగా ఉన్నారు. నన్ను మార్కెట్‌కు స్కూటీ మీద తీసికెళ్ళు. ఇంట్లో కూరగాయలు బొత్తిగా లేవు" అని చిరుకోపంతో అంది అమ్మ.

"స్కూటీనా..." అని ఆశ్చర్యంగా అడిగాను.

"అవును స్కూటీనే! ఆ గండు చీమలాగా వెనకాల ఎత్తుగా ఉన్న నీ బైక్ నేను ఎక్కను. నాకు ఎక్కడానికి కూడా రాదు," అంది చాలా కోపంగా.

మార్కెట్లో అమ్మ కూరగాయలు ఏరుతున్నంత సేపు మాట్లాడుతూనే ఉంది. నా ఫ్రెండ్స్ గురించి, స్టడీస్ గురించి, ప్రేయర్ లైఫ్ గురించి ఎంతో ఫ్రెండ్లీగా అడుగుతూ, నా నుండి అన్ని విషయాలూ రాబట్టింది. అదే అమ్మ స్పెషాలిటీ. తను ఇంటరాగేట్ చేస్తున్నట్లు అసలు అనిపించదు, కానీ అన్నీ తెలుసుకుంటుంది. నేను కూడా నిజాయితీగానే సమాధానామిచ్చాను. అయితే, చాలా సార్లు నేను నిద్రపోకుండా అర్థరాత్రి వరకు మొబైల్ వాడటం అమ్మ గమనించిందని నాకు అప్పుడు అర్థమైంది.

******

నాలుగు రోజుల తర్వాత...

"చూడు నాన్నా! ఈ మధ్య నీలో నేను గమనించింది ఏంటంటే... గంటలకు గంటలు మొబైల్ చూస్తూ నీలో నువ్వే నవ్వుకుంటూ ఉంటున్నావు. ఇంతకముందు మొబైల్ కేవలం స్టడీస్ కోసమే వాడేవాడివి, నోట్స్ రాసుకొనేవాడివి. కానీ ఇప్పుడు కాలేజీలో, హాస్టల్లో నువ్వు మొబైల్‌ను ఎలా ఉపయోగిస్తున్నావో నాకు అర్థమవుతుంది. ఏదైనా సరే, అవసరానికి మించి ఉపయోగిస్తే అది అనర్థమే. నీ ఆత్మీయ పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదు. ఇంటికొచ్చినప్పటి నుంచి నువ్వు 'క్వయిట్ టైం' చేసుకోవడం గానీ, ప్రేయర్ చేసుకోవడం గానీ నేను చూడలేదు. పొద్దుస్తమానం ఆ మొబైలే లోకం అయిపోయింది."

> **"అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను." – రోమా 5:8**

"పాపులైన మనుష్యుల ఆలోచనలు, పనులు దేవుని నీతికి దూరంగా ఉంటాయి. అయితే తన కుమారుని మరణం ద్వారా మనం ఆయనతో తిరిగి శాంతియుత సంబంధం కలిగి ఉండేలా ఏర్పాటు చేశాడు. దీని వల్ల మనకు ఇప్పుడు దేవునితో మంచి సంబంధం కలిగి ఉండే అవకాశం, అలాగే భవిష్యత్తులో శాశ్వత జీవం పొందే నిరీక్షణ ఉన్నాయి," అని అమ్మ వివరించింది.

అమ్మ మాట్లాడుతుండగా నేను మొబైల్‌లో రీల్స్ చూస్తూ దొరికిపోయాను. చేతిలోని మొబైల్ పక్కన పెట్టి, అమ్మ చెప్తున్న మాటలు వింటూ ఆలోచనలో పడ్డాను. ఇవన్నీ నాకు తెలిసిన సత్యాలే. యేసుక్రీస్తు నా పాపాల కొరకు చనిపోయాడని నమ్మి, నా పాపాలు క్షమించమని అడిగి ఆయనను సొంత రక్షకునిగా అంగీకరించిన వాడినే. కానీ ఎక్కడో దారి తప్పాను.

అమ్మ మళ్ళీ ఏవో స్నాక్స్ పట్టుకొని నా దగ్గరికి వచ్చింది, తను చెప్పాలనుకున్నది ముగించడానికి. "రోమా 1:30, 31 వచనాలు నీ మొబైల్‌లోనే చదువు," అని అంది.

నేను చదవడం మొదలుపెట్టాను. ఆ వచనాలు మనుష్యులు దేవుని విసర్జించి, తమకు నచ్చిన పాపపు మార్గాల్లోనే నడుస్తూ దేవునికి దూరమైన పరిస్థితులను తెలియజేస్తున్నాయి. దేవుని న్యాయ విధులు బాగా తెలిసి కూడా, భయం లేకుండా ఆయనకు వ్యతిరేకంగా నడిచేవారు మరణానికి తగినవారని ఆ వాక్యం హెచ్చరిస్తోంది.

"చూడు నాన్న! సాతాను మనకున్న బలహీనతను చాలా బలంగా వాడుకుంటాడు. దేవునికి కొంచెం కొంచెం దూరంగా, తనకు దగ్గరగా ఉండేలా తీసికెళ్తాడు. "వేర్ దేర్ ఈజ్ నో విజన్ పీపుల్ పెరిష్" అని సామెతలు గ్రంథం చెబుతోంది. వాక్యం మన పాదములకు దీపం, మన త్రోవకు వెలుగు. ఆ వాక్యాన్ని మరిచిపోయేవారు వెలుగులో లేనట్లే లెక్క. చీకట్లో ఉన్నవారు తాము ఎక్కడ ఉన్నారో, ఎటు వెళ్తునారో వారికే తెలియదు," అని అమ్మ చాలా గంభీరంగా హెచ్చరించింది.

నా మనసులో ఏదో తెలియని భారం. "అమ్మ! నన్ను దేవుడు క్షమిస్తాడా?" అని బాధగా అడిగాను.

"ఎందుకు క్షమించడు? నిన్ను నిన్నుగా ప్రేమించే వాడు ఆయన. నీ మంచితనాన్ని బట్టి గానీ, నీ పనులను బట్టి గానీ ఆయన నీకు రక్షణ ఇవ్వలేదు. కేవలం తన కృపను, ప్రేమను బట్టే ఇచ్చాడు. ఆ ప్రేమకు కొలతలు లేవు, షరతులు లేవు."

అమ్మ నా తలను ప్రేమగా నిమురుతూ ఇలా అంది:

**ఈ ప్రేమ క్షమిస్తుంది**
**భయం నుండి విముక్తి చేస్తుంది**
**పాప బంధకాల నుండి విడుదల చేస్తుంది**
**నిరాశలో ఆశను, నిరీక్షణను ఇస్తుంది.**

"దేవుడు మనలను రక్షించుకున్నది పడిపోవడానికో, పారిపోవడానికో కాదు బ్రో... ఆయన పిలుపుకు తగినట్టుగా పరిగెత్తడానికి!"

"థ్యాంక్స్ అమ్మ," అంటూ కృతజ్ఞతతో అమ్మ రెండు చేతులు పట్టుకున్నాను.

**– చేగూడి శ్యామలా కృపారావ్,**
**టీచర్ మరియు గ్రాడ్యుయేట్, రాజేంద్రనగర్ జోన్**



# గ్రేడ్స్ కంటే స్కిల్స్ మిన్న

భారత మాజీ రాష్ట్రపతి, “మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా” డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం మన విద్యా వ్యవస్థలో ఒక కీలకమైన మార్పు రావాలని బలంగా కోరుకున్నారు. కేవలం మార్కుల వేటలో పడే విద్యార్థులను కాకుండా, నైపుణ్యాల వైపు కూడా మళ్ళే యువతను ఆయన ఆశించారు. చదువు అంటే కేవలం పరీక్షల్లో ర్యాంకులు సాధించడమే కాదు; ఆలోచించేవారిని, కొత్త వాటిని సృష్టించేవారిని, పని చేసి చూపించేవారిని (Doers) కూడా తయారుచేయడమే అసలైన విద్య అని ఆయన నమ్మారు.

పుస్తక జ్ఞానంతో పాటు సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే తత్వం, కమ్యూనికేషన్ వంటి ప్రాక్టికల్ నైపుణ్యాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన సూచించారు. దేశ నిర్మాణం కోసం, ఉద్యోగ అవకాశాల కోసం కనీసం 25 శాతం సిలబస్ కేవలం స్కిల్ డెవలప్‌మెంట్ కోసమే కేటాయించాలని ఆయన అభిప్రాయపడ్డారు. మార్కులకు మించిన ఈ ‘ఉపయోగపడే నైపుణ్యాలే’ నిజమైన విజయానికి దారులు వేస్తాయని ఆయన చెప్పిన మాటలు ఈనాటికీ అక్షర సత్యాలు.

> **భవిష్యత్తు ఎవరిదంటే..**
> **ఎవరైతే ఎక్కువ నైపుణ్యాలను నేర్చుకుని, వాటిని సృజనాత్మకమైన మార్గాలతో కలుపుతారో, వారిదే! – రాబర్ట్ గ్రీన్**

ఈ రోజుల్లో యువత ఎదుర్కొంటున్న అసలైన సమస్య ‘ఉద్యోగాలు లేకపోవడం’ కాదు, ‘ఉద్యోగానికి తగిన అర్హత లేకపోవడం’ (Crisis of Employability). దీన్నే మనం ‘స్కిల్స్ గ్యాప్’ (Skills Gap) అంటాం. అంటే, డిగ్రీ సర్టిఫికెట్లలో ఉండే మార్కులకు, కంపెనీలు ఆశిస్తున్న పనితనానికి మధ్య ఉన్న గ్యాప్. నిరుద్యోగం ఎక్కువగా ఉన్నప్పటికీ, కంపెనీలు మాత్రం తమకు కావాల్సిన “పనికొచ్చే టాలెంట్”

దొరకక ఇబ్బంది పడుతున్నాయి. ఉద్యోగ అర్హత (Employability) అంటే కేవలం డిగ్రీలు మాత్రమే కాదు... చదువు, శిక్షణ, పని అనుభవం మరియు కమ్యూనికేషన్, టీమ్‌వర్క్ వంటి సాఫ్ట్ స్కిల్స్ కలగలిసిన సమాహారం.

**1. గ్రేడ్లు వర్సెస్ నైపుణ్యాలు**

నిజమే, గ్రేడ్లు ముఖ్యం-అవి తలుపులు తెరుస్తాయి. చాలా కంపెనీలు ఇంటర్వ్యూలకు లేదా గ్రూప్ డిస్కషన్లకు పిలవాలంటే ముందుగా మీ మార్కులనే చూస్తాయి. మీ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ముందే, మీ మార్కులే మీ గురించి ఒక అభిప్రాయాన్ని కలిగిస్తాయి. కానీ, ఒక్కసారి ఆ తలుపు దాటి లోపలికి వెళ్ళాక, అక్కడ నిలదొక్కుకోవాలన్నా, కెరీర్లో రాణించాలన్నా మీరు వెంట తీసుకెళ్లే 'నైపుణ్యాలే' అత్యంత కీలకం.

స్పష్టంగా ఆలోచించగలిగే వారు, ఆప్యాయంగా మాట్లాడేవారు, అందరితో కలిసి పనిచేసేవారు, కొత్త విషయాలను త్వరగా నేర్చుకునేవారినే యజమానులు ఇప్పుడు కోరుకుంటున్నారు.

**2. గ్రేడ్ల కంటే నైపుణ్యాలెందుకు ముఖ్యం?**

గ్రేడ్లు మీరు విషయాన్ని ఎంత బాగా 'నేర్చుకున్నారో' కొలుస్తాయి. కానీ నైపుణ్యాలు (Skills) మీరు ఆ విషయాన్ని ఎంత సమర్థవంతంగా 'అమలు చేయగలరో' కొలుస్తాయి. సమస్యలను పరిష్కరించడానికి, టీమ్‌ను నడిపించడానికి, ఇతరులను ఒప్పించడానికి, కొత్త పరిష్కారాలను కనుగొనడానికి నైపుణ్యాలే అవసరం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఆటోమేషన్ శరవేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో, కేవలం బట్టీ కొట్టే సామర్థ్యానికి విలువ తగ్గిపోతోంది. దానికి బదులుగా, మనుష్యులు మాత్రమే చేయగలిగే పనులకు గిరాకీ పెరుగుతోంది.

* **ఆటోమేషన్ (Automation):** రొటీన్ పనులను AI చేసేస్తుంది. కాబట్టి ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (EQ), సృజనాత్మకత (Creativity) వంటి మానవీయ లక్షణాలకు విలువ పెరుగుతుంది.
* **శరవేగంగా మారుతున్న కాలం:** టెక్నాలజీ నిత్యం మారుతోంది. కాబట్టి పాత జ్ఞానాన్ని పట్టుకుని వేలాడటం కంటే, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకునేతత్వం ముఖ్యం.
* **రియల్-వరల్డ్ ఇంపాక్ట్:** కేవలం సమాచారాన్ని గుర్తుపెట్టుకోవడం కాదు, ఆ జ్ఞానాన్ని ఉపయోగించి సంక్లిష్టమైన సమస్యలను ఎవరు పరిష్కరించగలరో వారికే ఉద్యోగాలు వస్తాయి.

**3. కంపెనీలు కోరుకుంటున్న టాప్ సాఫ్ట్ స్కిల్స్**

"నెక్స్ట్-జెన్ స్కిల్ సెట్" అంటే సంప్రదాయ మార్కుల నుండి ప్రాక్టికల్ నైపుణ్యాల వైపు మళ్ళడం. బట్టీ చదువుల కంటే క్రిటికల్ థింకింగ్, డిజిటల్ లిటరసీ, మానసిక దృఢత్వం వంటి వాటికే ఇప్పుడు పట్టం కడుతున్నారు.

* **కమ్యూనికేషన్ (Communication):** స్పష్టంగా రాయడం, ఎదుటివారికి నచ్చేలా మాట్లాడటం, శ్రద్ధగా వినడం ముఖ్యం. మీ ఆలోచనలను ప్రపంచానికి ఎంత బాగా చెప్పగలరు అనేదానిపైనే మీ విజయం ఆధారపడి ఉంటుంది. మీ మాటలు మీ గురించి చెప్పే 'రెజ్యూమే'లా కాకుండా, మీ పనులను చూపించే 'పోర్ట్‌ఫోలియో'లా ఉండాలి.
* **సమస్యల పరిష్కారం / క్రిటికల్ థింకింగ్:** విషయాన్ని గుర్తుంచుకోవడం దాటి.. సమస్య మూలాలను గుర్తించడం, ప్రత్యామ్నాయాలను ఆలోచించడం, సరైన నిర్ణయం తీసుకోవడం అలవర్చుకోవాలి.
* **సాంకేతిక పరిజ్ఞానం (Technological Literacy):** డిజిటల్ టూల్స్, AI వాడకంపై పట్టు ఉండటం ఇప్పుడు కనీస అవసరం.
* **ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (EQ):** భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, సహానుభూతి (Empathy) చూపించడం, గొడవలను పరిష్కరించుకోవడం చాలా ముఖ్యం. AI ప్రపంచంలో మనుషులతో వ్యవహరించేటప్పుడు EQ కీలకం.
* **టీమ్‌వర్క్ & సహకారం:** భిన్నమైన వ్యక్తులతో కలిసి ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయగలగాలి. కార్యాలయాల్లో 86% వైఫల్యాలకు కారణం

సరిగ్గా కలిసి పనిచేయలేకపోవడమే అని గణాంకాలు చెబుతున్నాయి.

* **అడాప్టబిలిటీ & రెసిలియెన్స్** (Adaptability): మారుతున్న పరిస్థితులకు, టెక్నాలజీకి త్వరగా అలవాటు పడటం, క్లిష్ట సమయాల్లో తట్టుకుని నిలబడటం.

### 4. క్రిటికల్ థింకింగ్ పెంచుకోవడం ఎలా?

ఈ నైపుణ్యాలను మీరు రోజువారీ అలవాట్ల ద్వారా పెంచుకోవచ్చు:

* **మంచి ప్రశ్నలు అడగండి:** ఏదైనా చదివి నప్పుడు లేదా విన్నప్పుడు కేవలం నోట్స్ రాసుకోవడమే కాకుండా, లోతైన ప్రశ్నలు అడుగుతూ, దానికి పరిష్కారం వెదకడం.
* **"థింకింగ్ అలౌడ్" ప్రాక్టీస్ చేయండి:** మిత్రులతో కలిసి వారానికి ఒకసారి 30 నిమిషాలు కూర్చుని, ఒక సమస్యపై చర్చించండి. ఒకరు సమస్యను వివరిస్తే, మిగతావారు ప్రశ్నలు అడిగి ఆ విషయాన్ని విశ్లేషించండి.
* **చిన్న కేస్ స్టడీస్ చేయండి:** ఏదైనా వార్తను లేదా సమస్యను తీసుకుని, దాని కారణాలు, పర్యవసానాలు, మూడు సాధ్యమైన పరిష్కారాలను (లాభనష్టాలతో సహా) ఆలోచించండి.
* **300 పదాల రిఫ్లెక్షన్ రాయండి:** ఏదైనా సమస్యను పరిష్కరించాక.. మీరు ఏం చేశారు? ఎందుకు చేశారు? ఏది పని చేసింది? ఏది విఫలమైంది? అని రాసుకోండి.
* **"రెడ్ టీమ్" పద్ధతి:** మీ సొంత నిర్ణయాన్నే వ్యతిరేకిస్తూ వాదించుకోండి. దీనివల్ల మీ ఆలోచనలోని లోపాలు మీకు త్వరగా తెలుస్తాయి.
* **జ్ఞానం కోసం ప్రార్థించండి:** యాకోబు 1:5 వాక్యం చెప్పినట్లుగా, సత్యానికి, అపోహలకు మధ్య ఉన్న తేడాను గ్రహించడానికి వివేచన కోసం దేవుణ్ణి అడగండి.

### 5. టీమ్‌వర్క్ మరియు కొలాబరేషన్ విలువ

21వ శతాబ్దంలో టీమ్‌వర్క్ అనేది అత్యంత కీలకమైన నైపుణ్యం. ఒక్కోసారి మనకు వ్యక్తిగతంగా ఎంత టాలెంట్ ఉన్నా, నలుగురితో కలిసి పనిచేయగలిగే సామర్థ్యమే మన విజయానికి కొలమానం అవుతుంది. క్లిష్టమైన ప్రాజెక్టులను డీల్ చేయాలన్నా, అందరితో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నా టీమ్‌వర్క్ తప్పనిసరి.

### 6. కాలేజీ, చర్చి/మినిస్ట్రీ పనుల ద్వారా స్కిల్స్ సాధన

ఈ నైపుణ్యాలను మనం తరగతి గదుల్లోనే కాదు, బయట కూడా నేర్చుకోవచ్చు. కాలేజీలో గ్రూప్ ప్రాజెక్ట్స్ చేయడం, టెక్నికల్ ప్రజెంటేషన్లు ఇవ్వడం, స్టూడెంట్ కమిటీల్లో పనిచేయడం ద్వారా వీటిని సాధన చేయవచ్చు. అలాగే, మనకున్న తలాంతులను ఉపయోగించి చర్చిలలో లేదా విద్యార్థి సహవాసాల్లో (UESI/EGF వంటివి) పనిచేయడం ద్వారా వీటిని ఇంకా మెరుగుపరుచుకోవచ్చు.

#### నా వ్యక్తిగత సాక్ష్యం:

యుఇయస్ఐ పరిచర్య నాకు పరిచయం కాకముందు, నాకు విపరీతమైన ఆత్మన్యూనతా భావం (Inferiority Complex) ఉండేది. నా మాటతీరు, నా నేపథ్యం, నా రూపం చూసుకుని కుంగిపోయేవాడిని. కానీ దేవుని కృప వల్ల రక్షింపబడ్డాక, మినిస్ట్రీలో చురుగ్గా పాల్గొనడం మొదలుపెట్టాను. దేవుని దృష్టిలో నా జీవితానికి ఎంతో విలువ ఉందని, సృష్టికర్త అయిన దేవునికి నేను సొంతమని తెలుసుకున్నాను. ఆ క్షణమే నా ఆత్మన్యూనతా భావం పటాపంచలైంది.

నేను బైబిల్ స్టడీ గ్రూప్స్, క్యాంపులు, కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అవ్వడం ప్రారంభించాను. టెంట్‌మేకర్‌గా ఉత్తర భారతదేశానికి వెళ్లాను. బైబిల్ స్టడీస్ నడిపించడం, క్యాంపులు నిర్వహించడం, విద్యార్థులతో సమన్వయం చేసుకోవడం, స్నేహితులను గాస్పల్ మీటింగ్స్‌కు ఆహ్వానించడం వంటి పనులను బాధ్యతగా తీసుకున్నాను. దేవుడు నాకు ఇయు కోశాధికారిగా, కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీలో విద్యార్థి ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించాడు. ఈ అనుభవాల ద్వారా దేవుడు నాలో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, సమస్యలను పరిష్కరించే తత్వం, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలను తీర్చిదిద్దాడు.

ఈ "లైఫ్ స్కిల్స్" నా వృత్తిపరమైన జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఉదాహరణకు, ఎన్.ఐ.టి వరంగల్ (NIT-Warangal) లో క్యాంపస్ సెలక్షన్స్ జరిగినప్పుడు, గ్రూప్ డిస్కషన్లలో నేను ఎప్పుడూ ఎలిమినేట్ కాలేదు. దీనికి ప్రధాన కారణం... బైబిల్ స్టడీ గ్రూపుల్లో నేను సాధన చేసిన కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతరులతో ఆలోచనలు పంచుకోవడం, అందరితో కలుపుగోలుగా ఉండటమే.

**7. దేవుని రాజ్య విస్తరణ కోసం ఈ నైపుణ్యాలు**

మన నైపుణ్యాలను కేవలం కెరీర్ కోసమే కాకుండా, దేవుని సేవలో ఒక భాగంగా చూడాలి. ఇది సాధారణ పనులను కూడా ఆరాధనగా మారుస్తుంది. దేవుడిచ్చిన ఆత్మీయ వరాలను, మనం నేర్చుకున్న ప్రాక్టికల్ నైపుణ్యాలను జోడించి యుఇయస్ఐ పరిచర్యను, సంఘాన్ని బలపరచడానికి ఉపయోగించాలి.

* **ఆత్మీయ వైఖరి:** సేవ చేసే మనస్తత్వం, దేవుడిచ్చిన వాటికి జవాబుదారీగా ఉండటం (Stewardship), తగ్గింపు స్వభావం, నిజాయితీ.
* **ప్రాక్టికల్ లీడర్షిప్ స్కిల్స్:** స్పష్టంగా మాట్లాడటం, ఇతరులు చెప్పేది వినడం, టీమ్‌ను ప్రోత్సహించడం, గొడవలను పరిష్కరించడం, పనులను పద్ధతిగా ప్లాన్ చేయడం.

**8. ముగింపు**

అకడమిక్ మార్కులు, గ్రేడ్లు మనల్ని క్లాస్ రూమ్‌ల లోపలికి లేదా ఇంటర్వ్యూ గదుల వరకు తీసుకెళ్లగలవు. కానీ మనల్ని అక్కడ నిలబెట్టేవి, మనల్ని తీర్చిదిద్దేవి, ముందుకు నడిపించేవి మాత్రం నైపుణ్యాలే. ఆటోమేషన్, AI రాజ్యమేలుతున్న ఈ కాలంలో.. ఉద్యోగ అర్హత అంటే కేవలం సర్టిఫికెట్లు మాత్రమే కాదు; అది మన వ్యక్తిత్వం, సామర్థ్యం మరియు నిరంతరం నేర్చుకునే తత్వం. డాక్టర్ కలాం చెప్పినట్లు, నిజమైన విద్య ర్యాంకర్లను కాకుండా.. ఆలోచనాపరులను, ఆవిష్కర్తలను, సమాజానికి ఉపయోగపడేవారిని తయారుచేయాలి.

క్రిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలు సిద్ధాంతానికి, ఆచరణకు మధ్య వారధిలా పనిచేస్తాయి. ఇవి రాత్రికి రాత్రే వచ్చేవి కావు, కేవలం కార్పొరేట్ ట్రైనింగ్ రూముల్లో మాత్రమే దొరికేవి కావు. తరగతి గదుల్లో, చర్చల్లో, ప్రాజెక్టుల్లో, దేవుని పరిచర్యలో.. ప్రతి రోజూ సాధన చేయడం ద్వారా ఇవి మన సొంతమవుతాయి.



విశ్వాస కోణంలో చూస్తే, ఈ స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఇంకా లోతైన అర్థం ఉంది. మన సామర్థ్యాలు కేవలం కెరీర్ విజయానికి పనిముట్లు మాత్రమే కాదు; అవి ఇతరులకు సేవ చేయడానికి, దేవుని రాజ్యాన్ని విస్తరించడానికి దేవుడు మనకు అప్పగించిన బహుమానాలు. ఈ నెక్స్ట్-జనరేషన్ స్కిల్‌సెట్‌ను దేవుని ఉద్దేశంతో జోడించి నేర్చుకోవడం ద్వారా.. మనం కేవలం 'జాబ్-రెడీ'గా మాత్రమే కాదు, 'లైఫ్-రెడీ'గా (జీవితాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా) మారుతాం.

"తన పనిలో నిపుణతగలవానిని చూచితివా? అల్పులైనవారి యెదుట కాదు వాడు రాజుల యెదుటనే నిలుచును" (సామెతలు 22:29)

వివిధ రకాల పనులను నైపుణ్యంతో, తెలివితో, వివేచనతో, అన్నీ రకాల కళలతో చేసే జ్ఞానాన్ని నింపాడు (నిర్గమ 35:31-35).

"చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైనను నీ శక్తిలోపములేకుండ చేయుము" (ప్రసంగి 9:10).

కాబట్టి మన బలహీనతలను బట్టి కాకుండా, మనలను బలపరచే దేవుని కార్యసాధకమైన శక్తిని బట్టి నైపుణ్యాలను పెంపొందించుకుందాం. వాటిని దేవుని మహిమ కోసం, ఆయన రాజ్య వ్యాప్తి కొరకు ఉపయోగిద్దాం.

**- యు. జోసెఫ్,** ఘట్‌కేసర్



# అర్బన్ స్టూడెంట్స్ మినిస్ట్రీ ఎందుకు అవసరం?

> "మీరు రాబోయే తరాన్ని చేరుకోవాలనుకుంటే, నగరాలను చేరుకోండి. మీరు సంస్కృతిని ప్రభావితం చేయాలనుకుంటే, నగరాలను ప్రభావితం చేయండి. మీరు ప్రపంచాన్ని చేరుకోవాలనుకుంటే, నగరాలను చేరుకోండి." – డా. టిమ్ కెల్లర్

సాధారణంగా 17 నుండి 25 ఏళ్ళ వయసు ఉండి, నగరాల్లో లేదా మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువతీ యువకులను 'అర్బన్ స్టూడెంట్స్' అని పిలుస్తాం. వీరు నగర జీవితంలోని ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక మరియు ఆత్మీయ పరిస్థితుల ద్వారా రూపుదిద్దబడతారు. వైవిధ్యం (Diversity), నిరంతర ప్రయాణాలు (Mobility) మరియు సంక్లిష్టతలతో (Complexity) కూడిన అత్యంత వేగవంతమైన వాతావరణంలో వీరు జీవిస్తుంటారు. భారతీయ విద్యార్థులలోని ఈ వర్గం పాశ్చాత్య మీడియా మరియు భావజాలాల ప్రభావానికి ఎక్కువగా గురవుతోంది.

### అర్బన్ స్టూడెంట్స్‌ను అర్థం చేసుకోవడం

నగర ప్రాంత ప్రజలు, ముఖ్యంగా నేటి అర్బన్ విద్యార్థులు, బహుళత్వ ప్రపంచ దృక్పథం (pluralistic worldview), సాపేక్షతావాదం (relativism) మరియు నిరంతర సాంకేతిక అనుసంధానం (hyper-connectivity) వంటి అంశాలకు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. గ్లోబల్ పాప్ కల్చర్, సోషల్ మీడియా ట్రెండ్స్ మరియు వినియోగదారీ తత్వం (consumerism) వీరిపై బలమైన ముద్ర వేస్తున్నాయి. తరచుగా వీరు చదువులో రాణించాలనే ఒత్తిడి, ఒంటరితనం మరియు మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటారు. ఆత్మీయ విషయాలపై ఆసక్తి ఉన్నప్పటికీ, సంస్థాగతమైన మతం పట్ల వీరికి సందేహాలు ఎక్కువ. అయినప్పటికీ, వీరు నిజాయితీని, మంచి స్నేహబంధాలను (community) మరియు జీవితానికి ఒక అర్థాన్ని (purpose) కోరుకుంటున్నారు.

**కీలక భావనలు:**

* **బహుళత్వ ప్రపంచ దృక్పథం (Pluralistic Worldview):** విభిన్నమైన స్వతంత్ర వాస్తవాలు, నమ్మకాలు మరియు సమూహాలు ఏకకాలంలో కలిసి ఉండగలవని నమ్మడం.
* **సాపేక్షతావాదం (Relativism):** సత్యం, జ్ఞానం, నైతికత అనేవి అందరికీ ఒకేలా

ఉండవని, అవి వ్యక్తిని బట్టి, సంస్కృతిని బట్టి లేదా సందర్భాన్ని బట్టి మారుతుంటాయనే తాత్విక భావన.

* **హైపర్-కనెక్టివిటీ** (Hyper-connectivity): డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఎప్పుడూ ఇతరులతో అనుసంధానమై ఉండటం. ఇంటర్నెట్ ద్వారా మనుషులు, పరికరాలు మరియు సమాచారం నిరంతరం లింక్ అయి ఉండే స్థితి.
* **గ్లోబల్ పాప్ సంస్కృతి** (Global Pop Culture): టెక్నాలజీ మరియు మీడియా ద్వారా సంగీతం, ఫ్యాషన్ మరియు వినోదం వంటి సాంస్కృతిక అంశాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం.

## నగరాల ప్రభావం

నగరాలు ఆవిష్కరణలకు, విప్లవాలకు, కళలకు, సంగీతానికి, రాజకీయాలకు, వ్యాపారానికి మరియు కమ్యూనికేషన్‌కు కేంద్ర బిందువులు. ప్రస్తుతం జరుగుతున్న ఆవిష్కరణలు ఎక్కువగా "స్మార్ట్ సిటీ" టెక్నాలజీల చుట్టూ తిరుగుతున్నాయి. ఇవి డేటా మరియు టెక్నాలజీని ఉపయోగించి నగర జీవన ప్రమాణాలను, సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెడుతున్నాయి. నగరాలు వివిధ రకాల "విప్లవాలకు" వేదికలుగా నిలుస్తున్నాయి. వీటిని నిరంతరం జరిగే సామాజిక, సాంకేతిక మార్పులు (దైనందిన జీవితం) గానూ మరియు చారిత్రక రాజకీయ ఉద్యమాలుగానూ విభజించవచ్చు.

### కొనసాగుతున్న నగర విప్లవాలు:

**ఎ) సాంస్కృతికంగా:** 21వ శతాబ్దం అమెరికా, చైనా, బ్రెజిల్ లేదా ఇండియా లాంటి ఏ ఒక్క దేశం చేతకాక, నగరాల ద్వారా శాసించబడుతుంది. నిర్వహణ కష్టంగా మారుతున్న ఈ కాలంలో, దేశాల కంటే నగరాలే భవిష్యత్ ప్రపంచాన్ని నడిపించే పాలనా కేంద్రాలుగా మారుతున్నాయి. కాలం, టెక్నాలజీ మరియు జనాభా పెరుగుదల ఈ కొత్త పట్టణీకరణ యుగాన్ని వేగవంతం చేశాయి. ఇప్పటికే ప్రపంచ జనాభాలో సగానికి పైగా నగరాల్లోనే నివసిస్తున్నారు; ఈ శాతం వేగంగా పెరుగుతోంది. కేవలం 100 నగరాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 30% వాటాను కలిగి ఉన్నాయి మరియు దాదాపు అన్ని ఆవిష్కరణలూ ఇక్కడే జరుగుతున్నాయి.

**బి) మిషనరీ దృక్పథం** (Missiological Perspective):
నగరాలు నాలుగు ముఖ్యమైన కారణాల వల్ల అత్యంత వ్యూహాత్మకమైనవి:

1. **భావి తరం:** మీరు రాబోయే తరాలను చేరుకోవాలంటే, నగరాలను చేరుకోవాలి.
2. **సువార్త అందని ప్రజలు:** ప్రపంచంలో సువార్త అస్సలు తెలియని ప్రజలు చేరుకోలేని ప్రజలు (Unreached People Groups) కూడా ఉపాధి కోసం నగరాలకే వలస వస్తున్నారు. వారిని చేరుకోవాలంటే నగరాలకు వెళ్ళాలి.
3. **కల్చరల్ ఇన్‌ఫ్లూయెన్సర్స్:** సినిమాలు తీసేవారు, పుస్తకాలు రాసేవారు, పెద్ద పెద్ద వ్యాపార ఒప్పందాలు చేసేవారు నగరాల్లోనే ఉంటారు. సంస్కృతిపై అత్యధిక ప్రభావం చూపేవారు ఇక్కడే ఉన్నారు.
4. **పేదలు:** ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది నగరాలకు వలస వస్తున్నారు, వీరిలో చాలామంది పేదలు. దేవుడు పేదలను ప్రేమిస్తాడు మరియు వారి పట్ల శ్రద్ధ చూపిస్తాడు.

**సి) ఆంతరంగికంగా** (Viscerally): యోనా గ్రంథం 4వ అధ్యాయంలో, దేవుడు మొక్కల కంటే మనుషులను మరియు నగరాలను

ఎక్కువగా ప్రేమిస్తున్నట్లు చూస్తాం. 300 ఏళ్ల క్రితం కేవలం 3% జనాభా నగరాల్లో నివసించేవారు, కానీ ఇప్పుడు 50% మంది నగరాల్లోనే ఉన్నారు. ప్రతి రెండు నెలలకు దాదాపు 80 లక్షల మంది నగరాలకు వలస వస్తున్నారని అంచనా.

## అర్బన్ స్టూడెంట్స్ ఎందుకు ముఖ్యమైనవారు?

నగర విద్యార్థులు ఒక నగరం యొక్క ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతారు. వారి విద్యా వాతావరణం అకడమిక్ మరియు ప్రొఫెషనల్ ఎదుగుదలకు ఎక్కువ అవకాశాలను కల్పిస్తుంది.

మెరుగైన వనరులు, పాఠ్యేతర అంశాలు (extracurriculars), సాంస్కృతిక వైవిధ్యం మరియు ప్రొఫెషనల్ నెట్?వర్కింగ్ వారికి అందుబాటులో ఉండటం వల్ల వారు విమర్శనాత్మక ఆలోచనా పరులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంది.

- **ఉన్నత విద్యా ప్రమాణాలు:** మెరుగైన వనరులు, మౌలిక సదుపాయాల వల్ల వీరు చదువులో చక్కటి ప్రతిభ కనబరుస్తారు.
- **భవిష్యత్ నాయకులు:** వీరికి ప్రముఖ యూనివర్సిటీలు, కార్పొరేట్ కంపెనీల ఎక్స్పోజర్ ఉంటుంది కాబట్టి, వ్యాపారం, సైన్స్ మరియు కళల రంగాల్లో భవిష్యత్ నాయకులుగా ఎదిగే అవకాశం ఉంది.
- **ఆర్థిక సహకారం:** విద్యావంతులుగా వీరు సేవా రంగంలో ఉద్యోగాలు చేస్తూ, తలసరి ఆదాయం (GDP) పెరగడానికి మరియు నగర ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతారు.
- **సామాజిక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యత:** క్యాంపస్‌లు విభిన్న సంస్కృతులకు నిలయాలు. ఇది విద్యార్థులలో సహనాన్ని, ఇతరులను అర్థం చేసుకునే తత్వాన్ని పెంచుతుంది.
- **విమర్శనాత్మక ఆలోచన:** నగరాల్లోని విద్యా విధానం విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తుంది, ఇది నగర పాలనలో మరియు సామూహిక నిర్ణయాలలో పాల్గొనేలా చేస్తుంది.
- **సుసంపన్నమైన అనుభవాలు:** గ్రామీణ విద్యార్థులతో పోలిస్తే నగర విద్యార్థులు తరగతి గదికి విభిన్నమైన అనుభవాలను, జ్ఞానాన్ని తీసుకువస్తారు. ఇది అందరి అభ్యాసన అనుభవాన్ని మెరుగుపరుస్తుంది.

## నగర విద్యార్థుల సవాళ్లు

విద్యార్థులు తరచుగా తమ పనితీరు (performance) విషయంలో తీవ్ర ఒత్తిడిని, ఒంటరితనాన్ని మరియు మానసిక ఆందోళనలను ఎదుర్కొంటారు. వీరికి ఆత్మీయ విషయాలపై ఆసక్తి ఉన్నప్పటికీ, సంస్థాగత మతం పట్ల నమ్మకం తక్కువ. వారు నిజాయితీని, తోటివారి సాహచర్యాన్ని మరియు జీవిత పరమార్థాన్ని అన్వేషిస్తుంటారు.

* **గుర్తింపు గందరగోళం (Identity Confusion):** నేను ఎవరు? మారుతున్న ఈ ప్రపంచంలో నా విలువలూ ఏంటి?
* **ఏకాంతం (Isolation):** అందరితో "కనెక్ట్" అయి ఉన్నామని అనుకుంటున్నా, మానసికంగా చాలామంది ఒంటరిగా ఉంటున్నారు.
* **నైతిక అస్పష్టత (Moral Ambiguity):** ఇది తప్పు, ఇది ఒప్పు అనే స్పష్టత లేదు; అంతా వ్యక్తిగత ఇష్టాయిష్టాలే.
* **బర్న్అవుట్ సంస్కృతి (Burnout Culture):** చదువులో, సోషల్ లైఫ్?లో మరియు కెరీర్లో అందరికంటే ముందుండాలనే విపరీతమైన ఒత్తిడి.
* **ఆత్మీయ ఉదాసీనత:** సత్యం లేకుండానే మతాన్ని, ఆధ్యాత్మికతను కలగలిపి చూడటం.

**సమయ ఆవశ్యకత:**

***"నగర విద్యార్థి ఆధునికతకు-సంప్రదాయానికి మధ్య, వినియోగదారుల తత్వానికి-మనసాక్షికి మధ్య, ఉదాసీనతకు-ఉద్యమాలకు మధ్య చిక్కుకుని ఉన్నాడు. అందుకే సువార్త అనేది వారి సందర్భానికి తగినట్లుగా (contextual-ised), ధైర్యంగా (bold) మరియు సంబంధాలను పెంపొందించేదిగా (relational) ఉండాలి"***

**- అజిత్ ఫెర్నాండో**

## పట్టణ ప్రాంతాలను చేరడంలో సవాళ్లు

1. నగరం బహుళ సంస్కృతుల సమ్మేళనం. సాంస్కృతిక సున్నితత్వం (Cultural Sensitiv-ity) లేదనే నిరంతర ఆరోపణల పట్ల మనం చాలా ఓర్పుతో ఉండాలి.
2. క్రైస్తవ విశ్వాసం కేవలం ఆదివారం వరకే పరిమితం కాకుండా, వారి ఉద్యోగం మరియు వృత్తికి ఎలా సంబంధించినదో నగరాలు చూడగలగాలి.
3. గందరగోళాన్ని (disorder), మార్పును స్వీకరించడానికి మీరు సిద్ధంగా ఉండాలి మరియు ఇతరులకు సహాయం చేయాలి.
4. పరిచర్య అనేది తీవ్రమైన సువార్త దృక్పథంతో పాటు, న్యాయం పట్ల అంతే శ్రద్ధ కలిగి ఉండాలి.
5. కళల (Arts) ద్వారా సువార్తను ప్రకటించే నైపుణ్యం అవసరం.
6. చర్చిలు లేదా సంస్థలు ఇతర చర్చిలు లేదా సంస్థలతో కలిసి పని చేసే గుణాన్ని కలిగి ఉండాలి.

## యుఇయస్ఐ అర్బన్ మినిస్ట్రీ విజన్

"ప్రతి నగర విద్యార్థిని సువార్తతో అర్థవంతంగా చేరుకోవడానికి మరియు యుఇయస్ఐ దర్శనం, లక్ష్యాలకు అనుగుణంగా వారిని ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా మార్చడానికి యుఇయస్ఐ కాన్స్టిట్యూయెన్సీ మరియు సంఘానికి సౌకర్యం కల్పించడం."

**లక్ష్యాలు:**

ముఖ్యంగా యుఇయస్ఐ పరిధిలో ఈ క్రింది వాటిని నెరవేర్చడం (కానీ వీటికే పరిమితం కాదు)

1. స్థానిక, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలలో నగర విద్యార్థుల మధ్య పరిచర్య ఆవశ్యకత గురించి అవగాహన కల్పించడం.
2. భారతదేశంలోని నగర విద్యార్థుల మారుతున్న సాంస్కృతిక, రాజకీయ మరియు సామాజిక వాస్తవాలపై పరిశోధన చేసి, వాటికి తగిన స్పందనలను (responses) రూపొందించడం.
3. నగర విద్యార్థులను చేరుకోవడానికి మరియు వారిని శిష్యులుగా చేయడానికి అవసరమైన పద్ధతులపై ట్రైనింగ్ డిపార్ట్మెంట్‌తో సంప్రదించి, తగిన సమకాలీన శిక్షణను అందించడం.
4. నగర విద్యార్థులను చేరుకోవడానికి ఉపయోగపడే వనరులను రూపొందించడం (స్పీకర్ల డేటాబేస్, వైట్ పేపర్స్, నోట్స్, మాన్యువల్స్, పుస్తకాలు, ఆడియో/వీడియో వనరులు, ఇంటర్నెట్ వనరులు మొదలైనవి).
5. నగర విద్యార్థులను చేరుకోవడానికి ఇతర సంస్థలతో నెట్‌వర్కింగ్ చేయడం.

**రిఫరెన్స్:**


1) అర్బన్ సిటీ - డా. టిమ్ కెల్లర్
2) నాట్ బియాండ్ రీచ్ - మిస్టర్ ఆరోన్ పియర్స్.



**- డా. బి. విశాల్ రాజా జక్కరియాస్**
సెక్రటరీ, అర్బన్ మరియు ప్రీమియర్ ఇన్స్టిట్యూట్స్ సెల్, యుఇయస్ఐ తెలంగాణ

# దావీదూ... ఎక్కడున్నావ్?

సూర్యుడితో బాటు
వాడూ నిద్రలేస్తాడు
కొండమీద నిలబడి కండల్ని
ప్రదర్శిస్తాడు!

ఎర్రటి అహంకారాన్ని
నుదిటినిండా రుద్దుకొని
దేవుడిమీదే యుద్ధాన్ని
ప్రకటిస్తాడు!

రాగిరేకుల మీద ఊరేగుతూ
దేవుని ప్రజల్ని
దేశం నుంచే తరిమి కొడతానని
వాగ్దాన పౌరుల వారసత్వాన్నే
ప్రశ్నిస్తాడు!

ఏటిగాలుల మీద
ఎగిరి వస్తున్న చీత్కారం!
తీరిన పంక్తుల నిండా
భయంతో బీటలు వారిన సైన్యం!

పల్లకీలకే
పరిమితమైపోయిన నాయకుడు
పదవి కోసమే తప్ప
పెదవి విప్పడు.
గొల్యాతు కేకలు ఇంకా
గుబులు రేపుతూనే ఉన్నాయి
జీవం గల దేవుని నామం
జీవంలేని క్రైస్తవ్యం సాక్షిగా
తిరస్కారాల పాలవుతూనే ఉంది.

ఏట్లో అయిదు రాళ్ళు మాత్రం
తెల్లతెల్లగా ఇంకా
మెరుస్తూనే ఉన్నాయి
దావీదూ! ఎక్కడున్నావ్?

– తాళ్ళూరి ప్రసాద్

UESI PUBLICATIONS Since 1988

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited, Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)